మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 10-1-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 192 Issue: 192

Published from Jagitial
www.evarthalu.com

10 జనవరి 2026 - శనివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు పుష్య మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:52 సూర్యాస్తమయం - సా. 5:54 తిథి సప్తమి ఉ. 8:24 వరకు తరువాత అష్టమి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం హస్త మ. 3:37 వరకు తరువాత చిత్తా యోగం అతిగండ సా. 4:59 వరకు కరణం బవ ఉ. 8:24 వరకు భాలవ రా. 9:21 వరకు వర్జ్యం రా. 12:30 నుండి రా. 2:16 వరకు దుర్ముహూర్తం ఉ. 8:20 నుండి ఉ. 9:05 వరకు రాహుకాలం ఉ. 9:38 నుండి ఉ. 11:00 వరకు యమగండం మ. 1:46 నుండి మ. 3:09 వరకు గుళికాకాలం ఉ. 6:52 నుండి ఉ. 8:15 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:16 నుండి ఉ. 6:04 వరకు అమృత ఘడియలు ఉ. 9:09 నుండి ఉ. 10:53 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:01 నుండి మ. 12:45 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

# ఎందుకీ.. నీళ్ల లొల్లి?

"ఏపీ ఒక అడుగేస్తే, మేం పది అడుగులేస్తాం



## జల వివాదాలను పరిష్కరించుకుందాం

### ఏపీ సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తున్నా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి

ఏపీ సీఎం చంద్రబాబుకు టీజీ సీఎం రేవంత్ రెడ్డి కీలక సూచన చేశారు. జల వివాదాలను పరస్పరం కూర్చుని మాట్లాడుకోవడం ద్వారా పరిష్కరించుకుందామని అన్నారు. రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో సుజెన్ మెడికేర్ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ, రెండు రాష్ట్రాల మధ్య వివాదాలు ఉండకూడదనే కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని గుర్తు చేశారు. రాజకీయాలకు అతీతంగా నీటి సమస్యను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. కోర్టుల ద్వారా కాకుండా మన సమస్యలను మనమే పరిష్కరించుకుందామని విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్, జనవరి 9 (ఈవార్తలు): జల వివాదం విషయంలో రాజకీయ ప్రయోజనం పొందాలని తమ ప్రభుత్వం ప్రయత్నించడం లేదని స్పష్టం చేశారు. పంచాయితీ కావాలా, నీళ్లు కావాలా అని నన్ను అడిగితే తెలంగాణకు నీళ్లు కావాలని చెబుతానని, అదే సమయంలో వివాదాలు కావాలా, పరిష్కారం కావాలా అని అడిగితే పరిష్కారం కావాలని స్పష్టంగా చెబుతానని అన్నారు. ఏపీ సీఎం చంద్రబాబుకు ఈ వేదిక ద్వారా విజ్ఞప్తి చేస్తున్నానని, కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకులు సృష్టించవద్దని కోరారు. అలా అడ్డంకులు కలిగిస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని, దీనివల్ల రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాము వివాదాలు కోరుకోవడం లేదని, పరిష్కారం మాత్రమే



# తప్పదు పోరాటం మళ్లీ!

## వివాదంగా మౌలానా వర్సిటీ భూములు

- 50 ఎకరాలు వెనక్కి తీసుకునేందుకు సర్కారు యత్నం
- ప్రభుత్వం తగ్గకపోతే ఆందోళనలు ఉద్ధృతం చేస్తాం
- ప్రభుత్వానికి యూనివర్సిటీ విద్యార్థుల హెచ్చరిక
- కేటీఆర్‌ను కలిసి మద్దతు కోరిన విద్యార్థులు
- కాంగ్రెస్ సీరియల్ ల్యాండ్ గ్రాబర్ అన్న కేటీఆర్
- రాహుల్ ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీత

హైదరాబాద్, జనవరి 9 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీకి కేటాయించిన 50 ఎకరాల భూమిని వెనక్కి తీసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై వివాదం ముదురుతోంది. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోకపోతే, తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని విద్యార్థులు హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం కొందరు విద్యార్థులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను కలిసి తమ భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. గండిపేట మండలం, మణికొండలోని వర్సిటీ క్యాంపస్‌లో ఉన్న భూమిని తరువాయి 2 వ పేజీలో...

ఏఐ చాట్‌బాట్ 'గ్రోక్' ఇమేజ్ జనరేషన్‌పై ఎక్స్ పరిమితి విధించింది. ఈ వేదికగా అశ్లీల, అసభ్యకర దృశ్యాల క్రియేట్ అవుతున్నాయి అంటూ ఇటీవల పెద్దఎత్తున ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో ఇమేజ్ జనరేషన్ ఫీచర్‌ను ప్రీమియమ్ సబ్‌స్క్రైబర్లకు మాత్రమే పరిమితం చేసింది.



### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.13,931 |
| వెండి (గ్రాము): | రూ.268 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,456 |

# చెప్తే అర్థం కాదా?

సినిమా టికెట్ల ధరల పెంపు ఎందుకు?

- తెలివిగా మెమోలు ఎందుకు ఇస్తున్నారు?
- మంత్రి ప్రకటన చేసినా పట్టింపు లేదా?
- అధికారులపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం



హైదరాబాద్, జనవరి 9 (ఈవార్తలు): సినిమా టిక్కెట్ ధరల పెంపుపై తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభాస్ నటించిన 'ది రాజాసాబ్ల సినిమా టిక్కెట్ ధరలను పెంచుకునేందుకు అధికారులు అనుమతించడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. ధరల పెంపునకు అవకాశం కల్పిస్తూ తెలివిగా మెమోలు ఎందుకు ఇస్తున్నారని ప్రభుత్వం తరఫు న్యాయవాదిని హైకోర్టు ప్రశ్నించింది. సినిమా టిక్కెట్ ధరలను పెంచబోమని సినిమాటోగ్రఫీ మంత్రి స్వయంగా ప్రకటన చేశారని గుర్తు చేసింది. అయినప్పటికీ ధరలు పెంచుకోవచ్చని మెమోలు ఎందుకు ఇస్తున్నారని అసహనం వ్యక్తం చేసింది. ఎన్నిసార్లు చెప్పినా మీ ఆలోచన ఎందుకు మారడం లేదని తరువాయి 2 వ పేజీలో...




# 12 మంది దుర్మరణం

- హిమాచల్ ప్రదేశ్ లో ఘోర బస్సు ప్రమాదం
- 200 మీటర్ల లోతైన లోయలో పడిన ప్రైవేట్ బస్సు
- 33 మందికి గాయాలు.. పొగమంచు వల్లే ప్రమాదం
- ఘటనపై విచారణకు ఆదేశించిన హిమాచల్ ప్రభుత్వం

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సిర్మౌర్ జిల్లాలో ప్రయాణికులతో వెళుతున్న ఓ ప్రైవేట్ బస్సు అదుపుతప్పి సుమారు 200 మీటర్ల లోతైన లోయలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 33 మంది గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. సిమ్లా నుంచి కుప్వీకి వెళుతున్న ఈ బస్సులో మొత్తం 45 మంది ప్రయాణికులు ఉన్నారు. వీరంతా 'పోష్ణ పండుగ సందర్భంగా తమ తరువాయి 2 వ పేజీలో...

### విశ్వవాణి



క్యాన్సర్ కణాలు వాటంతటవే చంపుకొనేలా చేసే మాలిక్యూల్స్‌ను స్టాన్‌ఫర్డ్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. టీసీఐపీ1 అనే మాలిక్యూల్ క్యాన్సర్ కణాలతో కలిసి, ఆత్మహత్య చేసుకునేలా చేస్తాయని నేషనల్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధకులు వెల్లడించారు.



# ఇరాన్ అగ్నిగుండం

- మిన్నంటిన నిరసనలు.. దేశవ్యాప్తంగా ఇంటర్నెట్ బంద్
- వెల్లువెత్తిన ప్రజా వ్యతిరేకత.. 12 రోజులుగా కొనసాగుతున్న ఆందోళనలు
- నిరసనకారులను చంపితే తీవ్ర పరిణామాలు.. ఖమేనీకి డోనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు

టెహ్రాన్: ఇరాన్ ప్రభుత్వంపై ఆ దేశ ప్రజలు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. పడిపోతున్న ఆర్థిక వ్యవస్థ, ఆకాశాన్ని తాకుతున్న ధరలు, నిరుద్యోగంతో విసిగిపోయిన ప్రజలు సర్వోన్నత నేత అయతొల్లా అలీ ఖమేనీ నాయకత్వంలోని ఇస్లామిక్ పాలనకు వ్యతిరేకంగా రోడ్లపైకి వచ్చారు. గత మూడు సంవత్సరాలలో ఎన్నడూ లేని విధంగా టెహ్రాన్ వీధులు నిరసనకారులతో కిక్కిరిసిపోయాయి. నిరసనలు -2 వ పేజీలో...



# ఒక్కొక్కరికి లక్ష డాలర్లు

## గ్రీన్‌లాండ్ పౌరులకు ట్రంప్ ఆఫర్!

### డెన్మార్క్ నుంచి విడిపోయేందుకు ఎర

వాషింగ్టన్: డెన్మార్క్ ఆధీనంలోని గ్రీన్‌లాండ్‌ను తమ దేశంలో విలీనం చేసుకునేందుకు అమెరికాలోని డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం సరికొత్త ప్రణాళికను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. డెన్మార్క్ నుంచి విడిపోయి అమెరికాతో కలిసేలా అక్కడి ప్రజలను ఒప్పించేందుకు, ప్రతి పౌరుడికి నేరుగా నగదు చెల్లించే ప్రతిపాదనపై వైట్‌హౌస్‌లో చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ మేరకు రాయిటర్స్ వార్తా సంస్థ తన కథనంలో వెల్లడించింది. గ్రీన్‌లాండ్‌లోని 57,000 మంది పౌరులలో ఒక్కొక్కరికి 10,000 డాలర్ల నుంచి 1,00,000 డాలర్ల వరకు చెల్లించే ఆలోచనలో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ లెక్కన మొత్తం దాదాపు 6 బిలియన్ డాలర్లు తరువాయి 2 వ పేజీలో...

# 28 నుంచి పార్లమెంట్ సమావేశాలు

- ఏప్రిల్ 2 వరకు రెండు విడతలుగా కొనసాగింపు
- ఆదివారం రోజున ఫిబ్రవరి 1న బడ్జెట్ సమర్పణ
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో సభ ప్రారంభం
- షెడ్యూల్ వెల్లడించిన కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు



న్యూఢిల్లీ: 2026 సంవత్సరానికి సంబంధించిన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల షెడ్యూల్ ఖరారైంది. జనవరి 28 నుంచి ఈ సమావేశాలు జరగనున్నాయని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. ఈసారి కేంద్ర బడ్జెట్‌ను ఆదివారం రోజున ప్రవేశపెట్టే అవకాశం ఉండటం ఈ సమావేశాల తరువాయి 2 వ పేజీలో...




# శబరిమల ప్రధాన పూజారి అరెస్టు

కేరళలోని శబరిమల ఆలయంలో జరిగిన బంగారం చోరీ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. శబరిమల ప్రధాన పూజారి కందరారు రాజీవరును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అరెస్టు చేసింది. రాజీవరును శుక్రవారం ఉదయం ఒక గుర్తు తెలియని ప్రదేశానికి తీసుకువెళ్లి విచారించి, మధ్యాహ్నం సిట్ కార్యాలయానికి తరలించారని సంబంధిత వర్గాలు తెలిపాయి.

## రాశి ఫలాలు
10.1.2026

మేషం: సోదరులతో మాటపట్టింపులు కలుగుతాయి. చేపట్టిన పనులలో స్వల్ప అవరోధాలుంటాయి. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. వాహన ప్రయాణాలలో జాగ్రత్తగా ఉండాలి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఉద్యోగమున ఊహించని మార్పులు ఉంటాయి.

వృషభం: ధన వ్యవహారాలు కలసివస్తాయి. సన్నిహితులతో గృహమున సఖ్యతగా వ్యవహరిస్తారు. నూతన వాహనాలు కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపారాలు అభివృద్ధి బాటలో పయనిస్తాయి. దైవదర్శనాలు చేసుకుంటారు. ఉద్యోగమున పదోన్నతులు పెరుగుతాయి.

మిధునం: అవసరానికి చేతికి ధనం అందుతుంది. మిత్రుల నుండి ఆశ్చర్యకర విషయాలు తెలుస్తాయి. దూరప్రాంతాల బంధు మిత్రుల నుండి శుభవార్తలు అందుతాయి. గృహమున వ్యాపార ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. ఆర్థిక పరిస్థితి అనుకూలిస్తుంది. విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

కర్కాటకం: ముఖ్యమైన వ్యవహారాలలో వ్యయ ప్రయాసలు అధికమవుతాయి. వ్యాపార ఉద్యోగాలలో మరింత గందరగోళ పరిస్థితులుంటాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. దూరపు బంధువులతో మాటపట్టింపులు ఉంటాయి. సంతాన ఆరోగ్య విషయంలో కొంత అప్రమత్తంగా వ్యవహరించాలి.

సింహం: ఉద్యోగులు చేయని పనికి నిందలు పడతారు. ముఖ్యమైన పనులు వాయిదా వేయడం మంచిది. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. ఇంటా బయట సమస్యలు మరింత పెరుగుతాయి. ఆరోగ్యం సహకరించక ఇబ్బంది పడతారు. వృత్తి వ్యాపారాలు మందకోడిగా సాగుతాయి.

కన్య: నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి. నూతన కార్యక్రమాలను చేపట్టి లాభాలు అందుకుంటారు. ఆకస్మిక ధన లాభ సూచనలున్నవి. వృత్తి వ్యాపారాలు ఆశించిన రీతిలో రాణిస్తాయి. సన్నిహితులతో గృహమున ఆనందంగా గడుపుతారు. ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది.

తుల: ఉద్యోగాలలో ఇతరుల నుండి ఊహించని సమస్యలు ఎదుర్కొంటారు. వ్యాపార వ్యవహారాలు నిరుత్సాహ పరుస్తాయి. చేపట్టిన పనులలో శ్రమ తప్ప ఫలితం కనిపించదు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. దూర ప్రయాణాలు అంతగా కలిసి రావు. స్థిరాస్తి సంబంధిత వ్యవహారాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు.

వృశ్చికం: కుటుంబ సభ్యుల నుండి శుభవార్తలు అందుతాయి. సమాజంలో ప్రముఖుల పరిచయాలు కొంత ఉత్సాహం కలిగిస్తాయి. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. అన్ని వైపుల నుండి సహాయ సహకారాలు అందుతాయి. విద్యార్థులు పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు.

ధనస్సు: వ్యాపార ఉద్యోగాలు సమస్యాత్మకంగా మారుతాయి. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. కుటుంబ బాధ్యతలు పెరిగి ఒత్తిడి అధికమవుతుంది. అనుకున్న సమయానికి ధన సహాయం అందక ఇబ్బంది పడతారు. బంధు మిత్రుల నుండి ఊహించని మాటలు వినవలసి వస్తుంది.

మకరం: కుటుంబ సభ్యులతో చర్చలు లాభసాటిగా సాగుతాయి. నూతన ఋణ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. వృత్తి వ్యాపారాలలో ఒడిదుడుకులు అధిగమిస్తారు. దీర్ఘ కాలిక ఋణ సమస్యలు నుండి బయట పడతారు. స్థిరస్తి వివాదాలకు సంబంధించిన కీలక సమాచారం అందుతుంది.

కుంభం: నిరుద్యోగ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. బంధు మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారాల విస్తరణకు అవరోధాలు తొలగుతాయి. పుణ్యక్షత్రాలు సందర్శించుకుంటారు. ఆర్థిక పరంగా ఇబ్బందులను అధిగమించి ముందుకు సాగుతారు. చిన్ననాటి మిత్రులతో దూర ప్రయాణాలు చేస్తారు.

మీనం: ఉద్యోగస్తులకు అధికారుల ఆగ్రహానికి గురికావలసి వస్తుంది. దీర్ఘకాలిక ఋణ ఒత్తిడులు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలలో ఆకస్మికంగా నిర్ణయాలు మార్చుకుంటారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం దూర ప్రయాణాల వలన శ్రమాదిక్యత పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో స్వల్ప వివాదాలు ఉంటాయి.



# తప్పదు పోరాటం మళ్లీ!

**మొదటి పేజీ తరువాయి**

కేటాయించిన ప్రయోజనాలకు వినియోగించడం లేదని, కాబట్టి దానిని ఎందుకు వెనక్కి తీసుకోకూడదో వివరణ ఇవ్వాలంటూ రెవెన్యూ అధికారులు ఇటీవల మనూ రిజిస్ట్రార్ ఇష్తియాక్ అహ్మద్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ప్రభుత్వ చర్య వర్సిటీ భవిష్యత్తుకు ముప్పు కలిగిస్తుందని విద్యార్థులు కేటీఆర్ వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. నిరసన ప్రకటన తర్వాత తనకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని ఓ విద్యార్థి నాయకుడు ఆరోపించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ సర్కారు 'సీరియల్ కిల్లర్ల లాగా 'సీరియల్ ల్యాండ్ గ్రాబర్లగా మారిందని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే వర్సిటీ భూమిని అక్రమంగా చేజిక్కించుకోవాలని చూస్తోందని విమర్శించారు. తొలుత అగ్రికల్చర్ వర్సిటీ, ఆ తర్వాత హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను లాక్కోవాలని చూసిందని గుర్తుచేశారు. దేశంలో మైనారిటీల రక్షకుడినని చెప్పుకునే రాహుల్ గాంధీ.. తెలంగాణలో మైనారిటీ వర్సిటీ భూమిని కబ్జా చేస్తుంటే ఎందుకు స్పందించడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. "ఇదేనా మీ 'మొహబ్బత్ కీ దుకాణ్?" అని నిలదీశారు. మనూ విద్యార్థులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని, తాము తిరిగి అధికారంలోకి వచ్చాక వర్సిటీ విస్తరణకు అవసరమైన నిధులు కేటాయిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు.



## 12 మంది దుర్మరణం

**మొదటి పేజీ తరువాయి**

స్వగ్రామాలకు తిరిగి వెళుతున్నారు. హరిపుర్‌ధార్ మార్కెట్‌కు సమీపంలో మధ్యాహ్నం 3:30 గంటల ప్రాంతంలో బస్సు ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. దట్టమైన పొగమంచు కారణంగా బస్సు రోడ్డుపై నుంచి జారిపోయి ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రమాద తీవ్రతకు బస్సు నుజ్జునుజ్జయింది. ప్రమాద సమాచారం అందిన వెంటనే స్థానికులు, పోలీసులు, ఆరోగ్య సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీపంలోని నాహన్, రాజ్‌గఢ్ ఆసుపత్రులకు తరలించారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని మెరుగైన చికిత్స కోసం సిమ్లాలోని ఐజీఎంసీ ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా నిలవాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రమాదంపై మెజిస్టీరియల్ విచారణకు కూడా ప్రభుత్వం ఆదేశించింది.

### మోదీ దిగ్భ్రాంతి.. పరిహారం ప్రకటన

బస్సు ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దురదృష్టకర ఘటనలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత విచారకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పీఎంఎన్ఆర్ఎఫ్) నుంచి రూ. 2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం అందిస్తామని ప్రకటించారు.

## ఎందుకీ..నీళ్ల లొల్లి?

**మొదటి పేజీ తరువాయి**

కోరుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. తమకు కావలసింది రాజకీయ ప్రయోజనాలు కాదని, ప్రజల ప్రయోజనాలని అన్నారు. తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ ఉండాలంటే పక్క రాష్ట్రం సహకారం ఉండాల్సిందే అన్నారు. రెండు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకుంటేనే సమస్యలు పరిష్కారమవుతాయని వ్యాఖ్యానించారు. జల వివాదాల విషయంలో ఆంధ్రప్రదేశ్ ఒక్క అడుగు ముందుకు వేస్తే తాము 10 అడుగులు ముందుకు వేస్తామని చెప్పారు. ఇంకా ఆయన మాట్లాడుతూ, పెట్టుబడులకు తెలంగాణ అనుకూలమైన రాష్ట్రమని అన్నారు. పెద్ద పెద్ద కంపెనీలకు మన దేశానికి చెందిన వారే సీఈవోలుగా ఉన్నారని పేర్కొన్నారు.

## ఇరాన్ అగ్నిగుండం

**మొదటి పేజీ తరువాయి**

ఉద్ధృతం కావడంతో అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. ఆందోళనకారులు ఒకరితో ఒకరు కనెక్ట్ కాకుండా ఉండేందుకు దేశవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలను పూర్తిగా నిలిపివేసింది. అంతర్జాతీయ టెలిఫోన్ కాల్స్, ల్యాండ్‌లైన్ సేవలు కూడా పనిచేయడం లేదు. గతంలో ఇలా ఇంటర్నెట్ ఆపివేసిన ప్రతిసారీ ప్రభుత్వం భారీ స్థాయిలో హింసాత్మక అణచివేతకు పాల్పడిందని విశ్లేషకులు గుర్తుచేస్తున్నారు. ప్రవాసంలో ఉన్న యువరాజు రెజా పహ్లావి ఇచ్చిన పిలుపుతో నిరసనలు మరింత ఊపందుకున్నాయి. టెహ్రాన్ లోని పలు ప్రాంతాల్లో ప్రజలు 'పహ్లావి తిరిగి రావాలి', 'ఇస్లామిక్ రిపబ్లిక్ నశించాలి' అంటూ నినాదాలు చేశారు. 1979 విప్లవానికి ముందున్న రాచరికాన్ని గుర్తుచేసుకుంటూ ప్రజలు నినదించడం ప్రభుత్వంపై ఉన్న తీవ్ర వ్యతిరేకతకు అద్దం పడుతోంది. ఇప్పటివరకు జరిగిన హింసలో 42 మంది మరణించగా, 2,270 మందికి పైగా నిరసనకారులను భద్రతా దళాలు అదుపులోకి తీసుకున్నాయి. శాంతియుత నిరసనకారులను చంపితే ఊరుకోబోమని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను హెచ్చరించారు. 'నిరసనకారులను చంపితే ఇరాన్ నరకాన్ని చూడాల్సి ఉంటుంది' అని ఆయన వ్యాఖ్యానించారు. దీనిపై ఇరాన్ స్పందిస్తూ విదేశీ శక్తుల ప్రోద్బలంతోనే ఈ అల్లర్లు జరుగుతున్నాయని, శత్రువులకు సహకరించే వారిపై కనికరం చూపేది లేదని ఆ దేశ ప్రధాన న్యాయమూర్తి స్పష్టం చేశారు. మరోవైపు, డ్రోన్ల సహాయంతో నిరసనకారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరిస్తోంది.

### ముందు నీ దేశం చూస్కో: ఖమేనీ

ఇరాన్‌లో 13వ రోజు ప్రభుత్వ వ్యతిరేక అల్లర్లు కొనసాగుతున్న వేళ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఉద్దేశించి ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇతర దేశాలకు సూచనలు చేసే ముందు సొంత దేశంపై దృష్టి సారించాలని హితవు పలికారు. దేశంలోని ఆందోళనకారులకు సైతం ఆయన హెచ్చరిక జారీ చేశారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. విదేశీ శక్తుల చేతుల్లో కీలుబొమ్మల్లా వ్యవహరించే వారిని సహించే ప్రసక్తి లేదని ఆయన స్పష్టం చేశారు. ఇతర దేశాధ్యక్షుడిని సంతోషపెట్టేందుకు సొంత వీధులను నాశనం చేసుకుంటున్నారని ఇరాన్ ఆందోళనకారులను ఉద్దేశించి అన్నారు. సొంత దేశంలో అశాంతిని రగిలించేందుకు పాశ్చాత్య శక్తులకు కొందరు వంత పాడుతున్నారని ఆయన విమర్శించారు.

## శబరిమల ప్రధాన పూజారి అరెస్టు

శబరిమల: కేరళలోని శబరిమల ఆలయంలో జరిగిన బంగారం చోరీ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. శబరిమల ప్రధాన పూజారి కందరారు రాజీవరును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అరెస్టు చేసింది. రాజీవరును శుక్రవారం ఉదయం ఒక గుర్తు తెలియని ప్రదేశానికి తీసుకువెళ్లి విచారించి, మధ్యాహ్నం సిట్ కార్యాలయానికి తరలించారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆ తర్వాత అతడి అరెస్టును ప్రకటించారని సమాచారం. శబరిమల ఆలయంలోని విగ్రహాలకు బంగారు తాపడం చేశాక బరువులో తేడా రావడం సంచలనం రేపిన విషయం తెలిసిందే. దీనిపై కేసు నమోదు చేసిన రాష్ట్ర ప్రభుత్వం, విచారణ కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసింది. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సిట్ అధికారులు తాజాగా ప్రధాన పూజారిని అరెస్టు చేయడం ఆసక్తికరంగా మారింది. శుక్రవారం వేకువజామున 4.30 గంటలకు సిట్ దర్యాప్తు అధికారి హెచ్ వెంకటేశ్ నేతృత్వంలో ప్రధాన పూజారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఉన్నికృష్ణన్ పొట్టి, ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు మాజీ అధ్యక్షుడు పద్మకుమార్ ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా సిట్ బృందం ప్రధాన పూజారిని అరెస్టు చేసింది.

## 28 నుంచి పార్లమెంట్ సమావేశాలు

**మొదటి పేజీ తరువాయి**

ప్రత్యేకతగా నిలవనుంది. రెండు విడతలుగా సాగే ఈ సమావేశాలు ఏప్రిల్ 2 వరకు కొనసాగుతాయి. కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు, పార్లమెంట్ ఉభయ సభలను సమావేశపరచడానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారని మంత్రి కిరణ్ రిజిజు తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. "2026 బడ్జెట్ సమావేశాలు జనవరి 28న ప్రారంభమై ఏప్రిల్ 2 వరకు జరుగుతాయి. తొలి విడత సమావేశాలు ఫిబ్రవరి 13తో ముగుస్తాయి. అనంతరం మార్చి 9న సభ తిరిగి సమావేశమవుతుంది. అర్థవంతమైన చర్చలకు, ప్రజలు కేంద్రంగా సాగే పాలనకు ఈ సమావేశాలు అత్యంత కీలకం" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. నివేదికల ప్రకారం, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తిస్థాయి బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఫిబ్రవరి 1 ఆదివారం కావడం గమనార్హం. పార్లమెంట్ చరిత్రలో ఆదివారం రోజున బడ్జెట్ ప్రవేశపెట్టడం చాలా అరుదు. దీనికోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని తెలుస్తోంది. ఇక బడ్జెట్‌కు ముందు, దేశ ఆర్థిక వ్యవస్థ పనితీరును సమీక్షించే ఆర్థిక సర్వేను29 లేదా 30న పార్లమెంట్ ఉభయ సభల ముందు ఉంచనున్నారు.

### రెండు విడతలుగా సమావేశాలు

ఈ బడ్జెట్ సమావేశాలను రెండు దశల్లో నిర్వహించనున్నారు. తొలి విడత జనవరి 28 నుంచి ఫిబ్రవరి 13 వరకు జరుగుతుంది. ఆ తర్వాత సభకు విరామం ఉంటుంది. ఈ విరామ సమయంలో వివిధ మంత్రిత్వ శాఖలకు చెందిన పార్లమెంటరీ స్థాయీ సంఘాలు బడ్జెట్ పద్దులు, వివిధ పథకాలకు కేటాయింపులపై లోతైన సమీక్ష జరుపుతాయి. అనంతరం మార్చి 9న రెండో విడత సమావేశాలు ప్రారంభమై ఏప్రిల్ 2 వరకు కొనసాగుతాయి. ఈ దశలో స్థాయీ సంఘాల నివేదికలపై చర్చించి, తుది ఆమోదం తెలుపుతారు. సంప్రదాయం ప్రకారం, సమావేశాల మొదటి రోజైన జనవరి 28న పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. ఈ ప్రసంగంలో ప్రభుత్వ విధానాలు, ప్రాధాన్యతలు, భవిష్యత్ ప్రణాళికలను ఆమె వివరిస్తారు. ఆర్థిక వృద్ధి, ద్రవ్యలోటు నియంత్రణ, మౌలిక సదుపాయాలు, ఉపాధి కల్పన వంటి కీలక అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించిన నేపథ్యంలో ఈ సమావేశాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. పన్నులు, ప్రభుత్వ వ్యయం, విధానపరమైన సంస్కరణలపై అధికార, విపక్ష సభ్యుల మధ్య వాడివేడి చర్చలు జరిగే అవకాశం ఉంది. రాష్ట్రపతి ఆమోదంతో సమావేశాల నిర్వహణకు అధికారికంగా ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి.



## ఒక్కొక్కరికి లక్ష డాలర్లు

**మొదటి పేజీ తరువాయి**

ఖర్చవుతుందని అంచనా. ఆర్కిటిక్ ప్రాంతంలోని వ్యూహాత్మక ద్వీపం గ్రీన్‌లాండ్‌ను తన నియంత్రణలోకి తెచ్చుకోవాలని అమెరికా భావిస్తున్న నేపథ్యంలో డెన్మార్క్ తీవ్రంగా స్పందించింది. ఎవరైనా తమ భూభాగాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే, సైనికులు పై అధికారుల ఆదేశాల కోసం వేచి చూడకుండా వెంటనే ఎదురుదాడి చేయాలని డెన్మార్క్ రక్షణ శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు 1952లో ప్రవేశపెట్టిన 'షూట్ ఫస్ట (ముందు కాల్పులు జరపండి) అనే నిబంధనను డెన్మార్క్ ప్రభుత్వం తాజాగా ధ్రువీకరించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గ్రీన్‌లాండ్‌ను బలవంతంగా స్వాధీనం చేసుకోవాలని చూస్తే అది నాటో కూటమి ముగింపునకు దారితీస్తుందని డెన్మార్క్ ప్రధాని మెట్టే ఫ్రెడరిక్సెన్ హెచ్చరించారు. ఒక నాటో సభ్య దేశంపై మరొక సభ్య దేశం దాడి చేయడం రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పడిన అంతర్జాతీయ భద్రతా వ్యవస్థకే ముప్పు అని ఆమె పేర్కొన్నారు. గ్రీన్‌లాండ్ కేవలం తన సొంత ప్రజలకు మాత్రమే చెందుతుందని, ఎవరూ కొనుగోలు చేయలేరని ఆమె తేల్చి చెప్పారు.

## చెప్తే అర్థం కాదా?

**మొదటి పేజీ తరువాయి**

హైకోర్టు నిలదీసింది. మెమో ఇచ్చే అధికారికి నిబంధనలు తెలియవా? అని వ్యాఖ్యానించింది. 'ది రాజాసాబ్ణ సినిమా టిక్కెట్ ధరలు పెంచుకునేందుకు అధికారులు గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం నుంచి ఈ నెల 11 వరకు సింగిల్ స్క్రీన్‌లలో రూ.105, మల్టీప్లెక్స్‌లలో రూ.132 పెంపునకు అనుమతి ఇచ్చింది. 12 నుంచి 18వ తేదీ వరకు సింగిల్ స్క్రీన్‌లలో రూ.62, మల్టీప్లెక్స్‌లలో రూ.89 పెంపునకు అనుమతి ఇచ్చింది. టిక్కెట్ ద్వారా వచ్చే లాభాల్లో 20 శాతం ఫిలిం ఫెడరేషన్‌కు ఇవ్వాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 'రాజాసాబ్ణ టిక్కెట్ ధరల పెంపును సవాల్ చేస్తూ హైకోర్టులో విజయ్ గోపాల్ అనే న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా టిక్కెట్ల ధరల పెంపునకు అనుమతిస్తున్నారని న్యాయవాది విజయ్ గోపాల్ పిటిషన్‌లో పేర్కొన్నారు. హోంశాఖ కార్యదర్శికి మెమో జారీ చేసే అధికారం లేదని ఆయన కోర్టుకు తెలిపారు. జిల్లాస్థాయి కలెక్టర్లు, హైదరాబాద్‌లో సీపీ మాత్రమే టిక్కెట్ల ధరల పెంపు, బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వాల్సి ఉంటుందని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు.

## ఐబొమ్మలు పుట్టుకొచ్చేది ఇందుకే!

**దోపిడీ చేసినందుకే ఐబొమ్మ రవి పుట్టుక**
**సీపీఐ నారాయణ మండిపాటు**

హైదరాబాద్, జనవరి 9 (ఈవార్తలు): తెలుగు రాష్ట్రాల్లో సినిమా టికెట్ ధరల పెంపునకు ప్రభుత్వాలు అనుమతి ఇవ్వడంపై సీపీఐ నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓవైపు ఐబొమ్మ రవిని పైరసీ సినిమాల కేసులో జైలులో పెట్టి వేధిస్తున్నారని అన్నారు. మరోవైపు సినిమా టికెట్ ధరలు వేలకు వేలు పెంచడానికి అనుమతిస్తున్నారని మండిపడ్డారు. నిర్మాతలు వేల కోట్లు పెట్టి సినిమాలు తీస్తుంటే సామాన్య ప్రజలమీద భారం వేస్తున్నారని అన్నారు. సినిమా టికెట్ వెయ్యి పెట్టి కొంటే థియేటర్ లో నీళ్లు తాగినా, కూల్ డ్రింక్ తాగినా మరో వెయ్యి ఖర్చు అవుతుందని అన్నారు. 'మీరు ఇలా దోపిడీని ప్రోత్సహిస్తూనే ఉంటే ఐబొమ్మ రవి లాంటివాళ్లు పుడుతూనే ఉంటార'ని అన్నారు. సినిమా టికెట్ల ధరలు పెంచితే ఐబొమ్మ రవి లాంటి వాళ్లను మీరు ఆపలేరని మండిపడ్డారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని ప్రభుత్వాలు సినిమాల జోలికి వెళ్లకుండా ఉండాలన్నారు. వాళ్లకు ఎక్కువగా రాయితీలు ఇవ్వాల్సిన అవసరంలేదని అన్నారు. టికెట్ ధరలు అసలు పెంచాల్సిన అవసరం లేదని మండిపడ్డారు. ఇదిలా ఉంటే సంక్రాంతికి విడుదలవుతున్న సినిమాలకు ప్రభుత్వాలు టికెట్ ధరలు పెంచుకోవడానికి అనుమతి ఇస్తున్నాయి. దీంతో ప్రీమియర్ షో టికెట్ ధరలు ఏకంగా ఐదు వందల నుండి వెయ్యి వరకు ఉంటున్నాయి.

# జేఎన్‌జే జర్నలిస్ట్స్ భూములపై కుట్రలా?

## నిజాంపేట్, పేట్ బషీరాబాద్ లో అక్రమాలు.. నిమ్మకాయల వంశీ శ్రీనివాస్ చట్టవ్యతిరేక చర్యలు!

### కుట్రలు బట్టబయలు చేసిన సభ్యులు .. సహకార శాఖ, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి: సభ్యులు



హైదరాబాద్, జనవరి 9 (ఈవార్తలు): జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హైజింగ్ సొసైటీ సీఈ, కార్యదర్శిగా సుదీర్ఘంగా కొనసాగుతున్న నిమ్మకాయల వంశీ శ్రీనివాస్ చట్ట వ్యతిరేక చర్యలను సభ్యులు హైదరాబాద్ ప్రెస్ క్లబ్ వేదికగా బట్టబయలు చేశారు. 2023 లో వంశీ శ్రీనివాస్ పై చార్జిషీటు, ఎన్నికల సంఘం ద్వారా కేసు నిజం కాదా? అని ప్రశ్నించారు. 2022 సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయకుండా నిర్లక్ష్యం వహించడంలో లోగుట్టు ఏమిటి? వెయ్యి కుటుంబాల ప్రయోజనాలను ఫణంగా పెట్టి భూములను జేఎన్‌జేహెచ్‌ఎస్ సభ్యులు అనుభవించకుండా ఎందుకు కుట్రపన్నారని నిలదీశారు. ప్రభుత్వం సానుకూలంగా ఉన్నా నిజాంపేట, పేట్ బషీరాబాద్ భూములు జేఎన్‌జేహెచ్‌ఎస్ మ్యాక్ సొసైటీ సభ్యులకు దక్కనివ్వకుండా కుట్రపన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ గందరగోళంలో నిజాంపేట్, పేట్ బషీరాబాద్ భూములను అక్రమమార్గంలో కొట్టివేయాలని కుట్రపన్నింది ఎవరు? వారికి బాసటగా నిలిచింది ఎవరు? చొరబాటుదారులకు మార్గం సుగమం చేసింది ఎవరు? తేల్చాలని ప్రభుత్వాన్ని సభ్యులు కోరారు. నిజాంపేట్ లో భోగీ కృష్ణ పేరిట మూడు ఎకరాలు, ట్రింగర్స్ పేరిట రెండు ఎకరాలు అక్రమణలు జరిగాయని ఆరోపించారు. పేట్ బషీరాబాద్ లో కబ్జాలు, మానేటి శ్రీనివాస్ రెండు వేల గజాలు ఆక్రమించి రెండంతస్తుల ఇళ్లు, అపర్ణ వెంచర్స్‌కు సొసైటీ భూమిలోంచి రోడ్డు, సెయింట్ ఆన్స్ పాఠశాల ఎకరంన్నర కబ్జా అంశాల్లో నిమ్మకాయల వంశీ పాత్ర అనుమానాస్పందంగా ఉందన్నారు. ప్రభుత్వ ఖజానాకు చెల్లించగా అలాట్ అయిన భూమి అన్యాక్రాంతమైతే ఎందుకు మీ మీడియాహౌజ్‌ల ద్వారా ఆ కబ్జాలను వెల్లడించలేదని, సాటి జర్నలిస్టులకు జరుగుతున్న అన్యాయాన్ని ఎందుకు బహిర్గతం చేయడం లేదని వాపోయారు. జర్నలిస్టు సంఘాలు కూడా ఈ విషయంలో నోరు మెదపడం లేదెందుకు? ఈ దోస్తీ ఏమిటి? చార్జీషీటు తర్వాత విచారణ ఏమైంది? కంప్లయింట్ దారులు కూడా ఎందుకు మౌనం వహిస్తున్నారు? ఈ లోపాయికారీ ఒప్పందాలే తమకు శాపంగా మారాయన్నారు. చార్జ్ షీట్ నమోదై ఉన్న వ్యక్తికి ఓట్లేయమని పలు మీడియాల్లో కీలక స్థానాల్లో ఉన్నవారు ఎలా మెసేజ్ విడుదల చేశారు? అలా మెసేజ్ విడుదల చేసినందుకు గాను సొసైటీకి, సభ్యులకు జరిగిన అన్యాయానికి బాధ్యత వహిస్తారా?

లేదా మీ పేర్లను మీ అనుమతి లేకుండా వంశీ శ్రీనివాస్ వాడుకున్నారా స్పష్టం చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు.

**సహకార శాఖ చర్యలు తీసుకోవాలి**

2014 నుంచి 2021 వరకు సొసైటీకి ఎన్నికలు జరగకున్నా, జరిగినట్లుగా కమిటీ వ్యవహరిస్తే సహకార శాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సభ్యులు ప్రశ్నించారు. ప్రతి సంవత్సరం ఆడిట్ రిపోర్టులు , సభ్యుల వివరాలు ఎవరు పొందుపరిచారు? ఈ గందరగోళానికి కారణం అప్పటి ప్రభుత్వం, సంబంధిత ప్రభుత్వ శాఖలది కాదా? అన్నారు.

**సుప్రీం కోర్టుకు ఎందుకు?**

ఇళ్లులేని సొసైటీ సభ్యులు అఫిడవిట్లు ఇచ్చి భూములు తీసుకోవాలని 2010లో హైకోర్టు స్పష్టంగా పేర్కొన్నా, సభ్యులను సంప్రదించకుండా సుప్రీంకోర్టుకు వెళ్లారని సభ్యులు వాపోయారు. గవర్నమెంట్ మెమో నంబరు 19544 /ఏఎస్ఎస్ఎన్ 5(3) -- 2011, 04--01--2012 ద్వారా తమ సొసైటీ ప్రభుత్వానికి డబ్బులు కట్టిందన్నారు. ప్రభుత్వం ఐ అండ్ పీఆర్ శాఖ ద్వారా భూములను తమ సొసైటీకి స్వాధీన పరిచినా కూడా ఎందుకు సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పీ విరమించుకోలేదు? దీని వెనుక ఉన్న మర్మమేమిటో నిమ్మకాయల వంశీ చెప్పాలన్నారు.

**సీఎం రేవంత్ కు కృతజ్ఞతలు**

ఈ మొత్తం యవనికలో జేఎన్‌జేహెచ్‌ఎస్ సభ్యులను కాపాడుతున్న అంశం ఒకే ఒక్కటి. అది రాష్ట్ర ముఖ్యమంత్రి 2024, సెప్టెంబర్, ఎనిమిదవ తేదీన రవీంద్రభారతిలో భారీ సభ ఏర్పాటు చేసి పేట్ బషీరాబాద్ భూముల మీద అనుభవ హక్కులను ప్రసాదిస్తూ అధికారిక పత్రాన్ని విడుదల చేశారని సభ్యులు తెలిపారు. తమకు అండగా నిలిచిన కాంగ్రెస్ సర్కారుకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మీడియా అకాడమీ ఛైర్మన్ కే. శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు, ధన్యవాదాలు చెప్పారు.

## 12న బాల భరోసా ప్రారంభం

**అదే రోజు ప్రణామం పథకం కూడా**

**ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, జనవరి 9 (ఈవార్తలు): రాష్ట్రంలోని దివ్యాంగులు, వృద్ధులు, చిన్నారుల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన భాల భరోసా, ప్రణామం పథకాలను ఈ నెల 12న సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. దివ్యాంగుల సాధికారత కోసం ప్రభుత్వం రూ. 50 కోట్లు కేటాయించింది. దీనిలో భాగంగా రూ. 43.22 కోట్ల విలువైన సహాయక పరికరాలను 7 వేల మంది అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. రెట్రోఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాలు, బ్యాటరీతో నడిచే ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు, ల్యాప్‌టాప్‌లు, వినికిడి యంత్రాలు, మొబైల్ ఫోన్లు అందించనున్నారు. దివ్యాంగుల సహకార సంస్థ ఏర్పాటైన తర్వాత ఒకే ఆర్థిక సంవత్సరంలో ఈ స్థాయిలో నిధులు కేటాయించడం ఇదే మొదటిసారి కావడం విశేషం. వృద్ధుల మానసిక ఉల్లాసం, సంరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 37 ప్రణామం డే కేర్ సెంటర్లను ప్రభుత్వం మంజూరు చేసింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, హన్మకొండ జిల్లాల్లో రెండేసి చొప్పున, మిగిలిన 29 జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పనిచేసే ఈ కేంద్రాల్లో లైబ్రరీ, ఇండోర్ గేమ్స్, టీవీ, ఇంటర్నెట్ సదుపాయంతో కూడిన కంప్యూటర్లు ఉంటాయి. లబ్ధిదారులకు ఉచితంగా స్నాక్స్ తో పాటు వేడి వేడి భోజనం అందిస్తారు. ప్రతి సెంటర్ ఏర్పాటు, నిర్వహణ కోసం ప్రభుత్వం రూ. 12.48 లక్షలు మంజూరు చేసింది. ఐదేళ్ల లోపు చిన్నారుల్లో వైకల్యాలను ముందస్తుగా గుర్తించి, తగిన చికిత్స అందించడమే లక్ష్యంగా 'బాల భరోసా' పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. అంగన్‌వాడీ టీచర్లు ప్రాథమిక స్క్రీనింగ్ నిర్వహిస్తారు.

## రికార్డు స్థాయిలో వైకుంఠ ద్వార దర్శనాలు

తిరుమల, జనవరి 9 (ఈవార్తలు): కలియుగ వైకుంఠం తిరుమలలో 10 రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగిన వైకుంఠ ద్వార దర్శనాలు విజయవంతంగా ముగిశాయి. డిసెంబర్ 30 నుంచి జనవరి 8 వరకు సాగిన ఈ దర్శనాల్లో టీటీడీ చరిత్రలోనే రికార్డు స్థాయిలో 7.83 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. శుక్రవారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. టీటీడీ కల్పించిన ఏర్పాట్లపై 93 శాతం భక్తులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేయడం ఆనందంగా ఉందన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2024లో 6.83 లక్షల మంది, 2023లో 6.47 లక్షల మంది దర్శించుకోగా, ఈసారి ఆ సంఖ్య భారీగా పెరిగింది. ఈ 10 రోజుల్లో శ్రీవారి హుండీ ద్వారా రూ.41 కోట్ల ఆదాయం సమకూరింది. రికార్డు స్థాయిలో 44 లక్షల లడ్డూలు విక్రయించామని ఛైర్మన్ వివరించారు. గతేడాదితో పోలిస్తే ఇది 10 లక్షల లడ్డూలు అధికం. అన్నప్రసాదాల వితరణ కూడా 27 శాతం పెరిగినట్లు తెలిపారు. 50 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 10 టన్నుల పండ్లతో చేసిన అద్భుత అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని పేర్కొన్నారు.

# రేవంత్ ఫెయిల్

**నోటిఫికేషన్లు ఇవ్వడంలో ఫెయిల్**

**పరీక్షల నిర్వహణలో ఫెయిల్**

**మాజీమంత్రి హరీశ్ ఎద్దేవా**



హైదరాబాద్, జనవరి 9 (ఈవార్తలు): ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై మాజీమంత్రి హరీశ్ రావు ఘాటుగా స్పందించారు. పరీక్షల నిర్వహణలో వైఫల్యం తెలంగాణ ప్రభుత్వ అసమర్థత, అవినీతికి నిదర్శనం అని మండిపడ్డారు. మొన్నటి పీజీ వైద్య విద్య పరీక్షల్లో బయటపడిన మెడికల్ స్కాం ఇంకా మరువకముందే...ఇప్పుడు అగ్రికల్చర్ బీఎస్సీ పరీక్షల్లో ప్రశ్నాపత్రాలను వాట్సాప్ ద్వారా ముందుగానే లీక్ చేసి, ఏఐ పెన్‌లతో రాసిన మోడరన్ స్కాం రాష్ట్రాన్ని దిగ్భ్రాంతికి గురి చేస్తోంది అని మాజీమంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వడంలో...విద్యార్థులకు పరీక్షలు నిర్వహించడంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది అని ఆరోపించారు. అన్ని విభాగాల్లో రేవంత్ రెడ్డి సర్కార్ పూర్తిగా విఫలం అయ్యింది అని ధ్వజమెత్తారు. ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన పరీక్ష పత్రాల లీక్ ఘటనపై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణలో వైఫల్యం తెలంగాణ ప్రభుత్వ అసమర్థత, అవినీతికి నిదర్శనం అని ధ్వజమెత్తారు. వరుస పరీక్ష పత్రాల లీక్‌లు విద్యార్థుల భవిష్యత్తును బలి చేస్తున్నాయి అని మాజీమంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన పరీక్ష పత్రాల లీక్ ఘటన పరీక్షల నిర్వహణలో ప్రభుత్వ చేతగాని తనాన్ని, అసమర్థతను, అవినీతిని బట్టబయలు చేస్తోంది అని మాజీమంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. మొన్నటి పీజీ వైద్య విద్య పరీక్షల్లో బయటపడిన మెడికల్ స్కాం ఇంకా మరువకముందే...ఇప్పుడు అగ్రికల్చర్ బీఎస్సీ పరీక్షల్లో ప్రశ్నాపత్రాలను వాట్సాప్ ద్వారా ముందుగానే లీక్ చేసి, ఏఐ పెన్‌లతో రాసిన మోడరన్ స్కాం రాష్ట్రాన్ని దిగ్భ్రాంతికి గురి చేస్తోంది అని మాజీమంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత బహిరంగంగా, అక్రమంగా పరీక్షలు జరుగుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు? అని నిలదీశారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుంటే ఈ ప్రభుత్వం ఎందుకు మొద్దు నిద్రలో మునిగి ఉంది? అని మాజీమంత్రి హరీశ్ రావు నిలదీశారు. మార్పు తెస్తామంటూ అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం...రెండేళ్ల వ్యవధిలోనే స్కాంలకు చిరునామాగా మారడం దురదృష్టకరం అని మాజీమంత్రి హరీశ్ రావు ధ్వజమెత్తారు. చివరకు విద్యా సంస్థలు సైతం అవినీతికి కేంద్రంగా మారడం రాష్ట్ర ప్రభుత్వ దిగజారుడు తనానికి, రేవంత్ రెడ్డి విలువల్లేని తనానికి నిదర్శనం అని మండిపడ్డారు. మహాకవి శ్రీశ్రీ 'కాదేదీ కవితకు అనర్హం'అని చెప్తే సీఎం రేవంత్ రెడ్డి మాత్రం 'కాదేదీ స్కాంకు అనర్హం'అని చెప్పడమే కాకుండా...చేసి చూపిస్తున్నారు అంటూ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వడం చేతకాదు, పరీక్షలను సక్రమంగా నిర్వహించడం చేతకాదు..ఇది రేవంత్ మార్క్ ప్రభుత్వ వైఫల్యం అని మాజీమంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడిన అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని మాజీమంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని బీఆర్ఎస్ పక్షన మాజీమంత్రి హరీశ్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఆగకుండానే టోల్ చెల్లింపు!



**హైదరాబాద్-విజయవాడ హైవేపై కొత్త ప్రయోగం**

**సంక్రాంతి రద్దీకి చెక్.. ట్రయల్ రన్ నిర్వహణ**

పంతంగి, జనవరి 9 (ఈవార్తలు): సంక్రాంతి పండుగ ప్రయాణాలు మొదలవడంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరుగుతోంది. ముఖ్యంగా పంతంగి టోల్ ప్లాజా వద్ద ఏటా కిలోమీటర్ల మేర నిలిచిపోయే ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు నేషనల్ హైవే అథరిటీ ఆఫ్ ఇండియా ఈసారి ఒక నూతన టెక్నాలజీని ప్రయోగాత్మకంగా అమలు చేస్తోంది. వాహనాలు ఆగకుండానే, కేవలం మూడు సెకన్లలో టోల్ వసూలు చేసేందుకు వీలుగా శాటిలైట్ ఆధారిత ఆటోమేటిక్ విధానాన్ని పరీక్షిస్తోంది. ఇందులో భాగంగా యాదాద్రి జిల్లా పంతంగి టోల్ ప్లాజా వద్ద గురువారం సాయంత్రం ట్రయల్ రన్ నిర్వహించారు. విజయవాడ వైపు వెళ్లే 8 టోల్ బూత్‌లలో ఈ ట్రయల్ రన్ చేపట్టారు. ఈ విధానంలో కెమెరాలు వాహనం నంబర్ ప్లేట్‌ను గుర్తించగానే, సెన్సార్లు ఫాస్టాగ్‌ను స్కాన్ చేసి ఆటోమేటిక్‌గా టోల్ రుసుమును వసూలు చేస్తాయి. ఈ పరీక్షల సమయంలో కొన్ని వాహనాలకు టోల్ ఫీజు సరిగ్గా కట్ కాకపోవడం వంటి సాంకేతిక సమస్యలను అధికారులు గుర్తించారు. పండుగ రద్దీ ప్రారంభమయ్యేలోపు ఈ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ, టోల్ ప్లాజా సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. సంక్రాంతికి ఊహించిన దానికంటే ఎక్కువ రద్దీ ఉండే అవకాశం ఉన్నందున, విజయవాడ మార్గంలో అదనంగా మరో రెండు టోల్ బూత్‌లను తెరవాలని అధికారులు యోచిస్తున్నారు. ఈ కౌంటర్లలో మాత్రం హ్యాండ్‌గన్‌లతో ఫాస్టాగ్‌లను స్కాన్ చేసి టోల్ వసూలు చేస్తారు. ఈ విధానాన్ని కూడా ట్రయల్ రన్‌లో పరీక్షించారు. ప్రస్తుతం హైదరాబాద్-విజయవాడ హైవేపై కేవలం పంతంగి వద్ద మాత్రమే ఈ కొత్త టెక్నాలజీని అమలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే, పండుగ సందర్భంగా జనవరి 9 నుంచి 18 వరకు హైదరాబాద్-విజయవాడ హైవేపై టోల్ ఫీజు రద్దు చేయాలని తెలంగాణ ఆర్ అండ్ బీ శాఖ కేంద్రాన్ని కోరింది. అయితే, ఈ అభ్యర్థనను కేంద్ర ప్రభుత్వం తిరస్కరించినట్లు సమాచారం.



## టీజీ డీజీపీకి ఊరట

**నియామకం సవాలు పిటిషన్ డిస్మిస్**

**4 వారాల్లో డీజీపీ నియామకం పూర్తి చేయాలని**

**యూపీఎస్సీకి ఆదేశం**

హైదరాబాద్, జనవరి 9 (ఈవార్తలు): తెలంగాణ డీజీపీగా బి. శివధర్ రెడ్డి నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. దీంతో ఆయనకు తాత్కాలికంగా ఊరట లభించింది. అదే సమయంలో, డీజీపీ నియామక ప్రక్రియను నాలుగు వారాల్లోగా పూర్తి చేయాలని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ)ని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. సామాజిక కార్యకర్త టి. ధనగోపాల్ రావు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. 'పూర్తి అదనపు బాధ్యతల'తో డీజీపీని నియమించడం సుప్రీంకోర్టు 'ప్రకాశ్ సింగ్ కేసు'లో ఇచ్చిన మార్గదర్శకాలకు విరుద్ధమని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. శివధర్ రెడ్డి నియామకాన్ని నిలిపివేసి, నిబంధనల ప్రకారం రెగ్యులర్ డీజీపీని నియమించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. గత ఏడాది సెప్టెంబర్ 26న డీజీపీ జితేందర్ పదవీ విరమణ చేయడంతో, 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన శివధర్ రెడ్డికి ప్రభుత్వం డీజీపీగా 'పూర్తి అదనపు బాధ్యతలు' అప్పగించింది. ఈ నియామకంపై గురువారం విచారణ జరిపిన జస్టిస్ పుల్ల కార్తీక్, శుక్రవారం తీర్పును వెలువరించారు. విచారణ సందర్భంగా, రాష్ట్ర ప్రభుత్వం 2017 నుంచి డీజీపీ నియామకానికి సంబంధించిన సీనియర్ ఐపీఎస్ అధికారుల జాబితాను పంపలేదని యూపీఎస్సీ కోర్టుకు తెలిపింది. అయితే, తాము పంపిన ప్రతిపాదనలను యూపీఎస్సీ తిప్పి పంపుతోందని అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి వాదించారు. వాదనలు విన్న న్యాయస్థానం, డీజీపీ నియామక ప్రక్రియపై ఫిబ్రవరి 5లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది.

## రిటైర్ కానున్న ఆరుగురు తెలుగు ఎంపీలు!


**2026లో ఖర్గే సహా 73 మంది రిటైర్**

న్యూఢిల్లీ/హైదరాబాద్, జనవరి 9 (ఈవార్తలు): ఈ ఏడాది తెలంగాణకు చెందిన ఇద్దరు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నలుగురు ఎంపీలు పదవీ విరమణ చేయనున్నారు. ఈ మేరకు రాజ్యసభ సచివాలయం ఈ సంవత్సరం రిటైర్ కాబోయే రాజ్యసభ సభ్యుల జాబితాను విడుదల చేసింది. ఇందులో తెలంగాణకు చెందిన బీఆర్ఎస్ ఎంపీ సురేశ్ రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ ఏప్రిల్ 9న రిటైర్ కానున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వైసీపీ ఎంపీలు అయోధ్య రామిరెడ్డి, పరిమళ్ నత్వానీ, పిల్లి సుభాష్ చంద్రబోస్, టీడీపీ సభ్యుడు సానా సతీశ్‌కు జూన్‌లో రాజ్యసభ సభ్యత్వం ముగుస్తుంది. రాజ్యసభ నుంచి 2026లో మొత్తం 73 మంది రిటైర్ కానున్నారు. ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, ఎన్సీపీ అధినేత శరద్ పవార్, కేంద్రమంత్రులు హర్దీప్ సింగ్ పూరీ, కాంగ్రెస్ ఎంపీ దిగ్విజయ్ సింగ్, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగొయ్‌ల పదవీ కాలం ముగుస్తుంది. పెద్దల సభలో ఖర్గే ప్రతిపక్ష నేత కావడంతో ఆయనకు మరోసారి అవకాశం దక్కవచ్చు. మహారాష్ట్ర నుంచి నలుగురు, తమిళనాడు నుంచి ఆరుగురు, ఒడిశా నుంచి నలుగురు, పశ్చిమ బెంగాల్ నుంచి ఐదుగురు, అసోం నుంచి ముగ్గురు, బీహార్ నుంచి ఐదుగురు, ఛత్తీస్‌గఢ్ నుంచి ఇద్దరు, హర్యానా నుంచి ఇద్దరు, హిమాచల్ ప్రదేశ్ నుంచి ఒకరు, గుజరాత్ నుంచి నలుగురు, ఝార□ండ్ నుంచి ఇద్దరు, మధ్యప్రదేశ్ నుంచి ముగ్గురు, రాజస్థాన్ నుంచి ముగ్గురు, ఉత్తర ప్రదేశ్ నుంచి పదిమంది, కర్ణాటక నుంచి నలుగురు, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, ఉత్తరాఖండ్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఒక్కరు చొప్పున రిటైర్ కానున్నారు.

## చైల్డ్ పోర్న్.. 24 మంది అరెస్టు

హైదరాబాద్, జనవరి 9 (ఈవార్తలు): రాష్ట్రంలో పిల్లల అశ్లీల వీడియోలు చూసేవారికి పోలీసులు దిమ్మ తిరిగే షాక్ ఇచ్చారు. 18 టీమ్స్‌తో కలిసి సైబర్ సెక్యూరిటీ ఆపరేషన్ నిర్వహించి 24మందిని అరెస్ట్ చేశారు. నిందితుల్లో ఇరిగేషన్ శాఖ అధికారి కూడా ఒకరు ఉన్నట్టు పోలీసులు వెల్లడించారు. అంతే కాకుండా నిందితులంతా మిడిల్ క్లాస్ వర్కింగ్ ఉద్యోగులేనని తెలిపారు. ఈ దాడుల్లో ఓ చిన్నారిని సైతం రక్షించినట్టు చెప్పారు. అరెస్ట్ అయినవారిలో గతంలోనూ ఇలాంటి నేరాలే చేసి ఇప్పటికే శిక్ష అనుభవించినవాళ్లు కూడా ఉన్నట్టు తెలిపారు. అయితే గతేడాదితో పోలిస్తే రాష్ట్రంలో పిల్లల అశ్లీల వీడియోలు చూడటం, షేర్ చేయడం 90శాతం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఒక్క ఏడాదిలోనే చిన్నారులతో చిత్రీకరించిన అశ్లీల వీడియోలు చూసిన నిందుతుల సంఖ్య పదింతలు పెరిగిందన్నారు. 2025లో పిల్లల అశ్లీల వీడియోలు చూసి షేర్ చేసిన కేసులు 875 నమోదవ్వగా 423 మందిని అరెస్ట్ చేశారు. అదే విధంగా 2024లో 37మంది అరెస్ట్ అయ్యారు.

## సికింద్రాబాద్ గుర్తింపును దెబ్బతీసే కుట్ర: తలసాని



సికింద్రాబాద్, జనవరి 9 (ఈవార్తలు): సికింద్రాబాద్‌కు ఉన్న ఘనమైన చరిత్రను, ప్రత్యేక గుర్తింపును దెబ్బతీయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని మాజీ మంత్రి, సనత్‌నగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్ర ఆరోపణలు చేశారు. పద్మారావునగర్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన... సికింద్రాబాద్ అస్థిత్వం కాపాడుకోవడం కోసం ప్రజలంతా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. సికింద్రాబాద్‌ను ప్రత్యేక కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 11వ తేదీన బాలంరాయిలోని లీ ప్యాలెస్‌లో కీలక సమావేశం నిర్వహించనున్నట్లు తలసాని తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ వాణిజ్య, వ్యాపార, కార్మిక సంఘాల నేతలు, కాలనీలు, బస్తీల కమిటీ ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. ఈ సమావేశంలో ఈ నెల 17న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ఎంజీ రోడ్డులోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు నిర్వహించనున్న భారీ ర్యాలీతో పాటు భవిష్యత్ కార్యాచరణపై సమగ్రంగా చర్చిస్తామని తెలిపారు. సికింద్రాబాద్ కార్పొరేషన్ ఏర్పాటు అయ్యే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని తలసాని హెచ్చరించారు. అవసరమైతే దశలవారీగా ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు, ఇతర ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఇది ఏ ఒక్క పార్టీకి సంబంధించిన పోరాటం కాదని, సికింద్రాబాద్ ప్రాంత ప్రజల ఆత్మగౌరవానికి సంబంధించిన ఉద్యమమని ఆయన పేర్కొన్నారు. ప్రజల అభిప్రాయాలను పట్టించుకోకుండా, సికింద్రాబాద్ చరిత్రను, సంస్కృతిని పక్కన పెట్టి ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని తలసాని విమర్శించారు. ఇలాంటి నిర్ణయాలు నియంతృత్వ ధోరణిని స్పష్టంగా చూపిస్తున్నాయని అన్నారు. సికింద్రాబాద్ ప్రత్యేకతను కాపాడుకోవాలంటే ప్రజలంతా ఒక్కటై నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.




## ఏపీలో ఆర్టీసీ అద్దె బస్సుల సమ్మె విరమణ

విజయవాడ, జనవరి 9 (ఈవార్తలు): సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు ఏపీ ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం భారీ ఊరట కల్పించింది. ఏపీఎస్ఆర్టీసీలో అద్దె బస్సుల యజమానులు జనవరి 12 నుంచి చేపట్ట తలపెట్టిన సమ్మెను విరమించుకున్నారు. ఆర్టీసీ యాజమాన్యంతో జరిపిన చర్చలు సఫలం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంఘం నేతలు ప్రకటించారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అద్దె బస్సుల యజమానులు సమ్మెకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. దీంతో పండుగ రద్దీ సమయంలో సుమారు 2,500 బస్సులు నిలిచిపోతాయని ప్రయాణికుల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, అద్దె బస్సుల సంఘాల నేతలతో చర్చలు జరిపారు. బస్సుల్లో ఓవర్‌లోడ్, ప్రమాదాల సమయంలో బీమా, కేఎంపీఎల్‌ను 5.77 నుంచి 5.27కి తగ్గించడం, నిర్వహణ ఖర్చుల కోసం ఇచ్చే మొత్తాన్ని పెంచడం, కార్మికుల వేతనాలు పెంచడం వంటి ఐదు ప్రధాన డిమాండ్లను యజమానులు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశాలపై ఎండీ వెంటనే రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో చర్చించారు. ఈ నెల 20వ తేదీలోగా సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రి హామీతో సంతృప్తి చెందిన యజమానులు సమ్మెను విరమిస్తున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో, సంక్రాంతి కోసం ఆర్టీసీ ఇప్పటికే ప్రకటించిన 8,432 ప్రత్యేక బస్సులతో పాటు 2,500 అద్దె బస్సులు కూడా యథవిధిగా నడవనున్నాయి. ఫలితంగా పండుగ వేళ ప్రయాణికుల ప్రయాణం సులభతరం కానుంది.

## వృథ నీటికోసం గొడవలెందుకు?

**ఏపీ, తెలంగాణ మధ్య వివాదాలు వద్దు: చంద్రబాబు**



రాజమండ్రి, జనవరి 9 (ఈవార్తలు): సముద్రంలోకి వృథగా పోతున్న నీటిని వాడుకునే విషయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య వివాదాలు ఎందుకని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించారు. గోదావరి మిగులు జలాల వినియోగంపై రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అనవసరమైన గొడవలకు అర్థం లేదని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా, రాయవరం గ్రామంలో రైతులకు పట్టాదారు పాస్‌బుక్కులు పంపిణీ చేసిన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టుపై తెలంగాణ అభ్యంతరాలు, రాయలసీమ ఎత్తిపోతల పథకంపై జరుగుతున్న వివాదాలను ప్రస్తావిస్తూ.. "కొందరికి నీళ్లు కాదు, కేవలం వివాదాలే కావాలి" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని, వివాదాల వల్ల ఎవరికీ ప్రయోజనం ఉండదని ఆయన తేల్చిచెప్పారు. 'ప్రతి ఏటా సముద్రంలోకి వృథగా పోతున్న 300 టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రంలో కరవు అనే మాటే ఉండదు. పోలవరం పూర్తయితే ఈ ప్రాంతంలో నీటి సమస్యలు తీరతాయి. పోలవరం నుంచి విశాఖపట్నం, అక్కడి నుంచి వంశధార వరకు నీటిని తీసుకెళతాం. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే తెలంగాణ కూడా మిగులు జలాలను వాడుకోవచ్చు' అని చంద్రబాబు వివరించారు. పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా నదికి తరలించి, అక్కడి నుంచి రాయలసీమకు నీరందించడం వల్లే ఆ ప్రాంతం హార్టికల్చర్ హబ్‌గా మారుతోందని గుర్తుచేశారు.

## కోనసీమ గ్యాస్ లీక్‌పై చంద్రబాబు ఏరియల్ సర్వే

కోనసీమ జిల్లా, జనవరి 9 (ఈవార్తలు): కోనసీమ జిల్లా, ఇరుసుమండ గ్రామంలోని ఓఎన్జీసీ బావి వద్ద ఐదో రోజు కూడా మంటలు కొనసాగుతుండటంతో, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ఏరియల్ సర్వే నిర్వహించారు. గ్యాస్ బావి నుంచి ఎగిసిపడుతున్న మంటలను, పరిసర ప్రాంతాల్లోని పరిస్థితిని ఆయన గగనతలం నుంచి పరిశీలించారు. అనంతరం మండపేట నియోజకవర్గంలోని రాయవరంలో ఆయన ఓఎన్జీసీ అధికారులు, కోనసీమ జిల్లా కలెక్టర్ మహేశ్ కుమార్, ఎంపీ హరీశ్ బాలయోగి, ఎమ్మెల్యే వరప్రసాద్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీసుకుంటున్న చర్యల గురించి సీఎం ఆరా తీశారు. మంటల వల్ల దెబ్బతిన్న కొబ్బరి చెట్లకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు, బ్లోఅవుట్‌ను అదుపులోకి తెచ్చేందుకు ఆమోదించిన ప్రణాళిక ప్రకారం ముమ్మరంగా పనిచేస్తున్నామని ఓఎన్జీసీ ఒక ప్రకటనలో తెలిపింది. సంక్షభ నిర్వహణ బృందం (జమీ) ఇప్పటికే బావి పరిసరాల్లోని శిథిలాలను చాలావరకు తొలగించి, బావి హెడ్ వద్దకు వెళ్లేందుకు మార్గం సుగమం చేసింది. బావిని క్యాపింగ్ చేసే దిశగా ఆపరేషన్ కొనసాగించేందుకు అడ్డంకిగా ఉన్న మాస్ట్, ఇతర పరికరాల భాగాలను తొలగించినట్లు పేర్కొంది. బావి హెడ్ సమీపంలో సురక్షతంగా పనిచేసేందుకు వీలుగా నిరంతరం నీటిని చల్లుతున్నామని వివరించింది. ప్రస్తుతం పరిస్థితి నిలకడగా ఉండటంతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తమ సాధారణ కార్యకలాపాలను తిరిగి ప్రారంభించారు. కాగా, సోమవారం మధ్యాహ్నం మరమ్మతు పనులు చేస్తుండగా ఈ బావి నుంచి అకస్మాత్తుగా ముడిచమురుతో కూడిన గ్యాస్ భారీగా ఎగిసిపడిన విషయం తెలిసిందే. దీంతో ఇరుసుమండ, పరిసర గ్రామాల్లో దట్టమైన పొగ, గ్యాస్ వ్యాపించి ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.

## ఫెమా కేసులో కాకినాడ సీపోర్ట్స్‌కు ఊరట

కాకినాడ, జనవరి 9 (ఈవార్తలు): కాకినాడ సీపోర్ట్స్ లిమిటెడ్‌పై ఫెమా (ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్) నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి కొనసాగుతున్న విచారణ ప్రక్రియ ముగిసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నుంచి 'నో అబ్జెక్షన్ల సర్టిఫికెట్ పొందిన తర్వాత, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) 2025 డిసెంబర్ 12న కాంపౌండింగ్ ఆర్డర్‌ను జారీ చేసింది. ఈ మేరకు ఈడీ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. విశ్వసనీయ సమాచారం ఆధారంగా, కాకినాడ సీపోర్ట్స్‌పై ఈడీ ఫెమా నిబంధనల కింద దర్యాప్తు చేపట్టింది. విచారణ అనంతరం 2024 సెప్టెంబర్ 5న అడ్జుడికేటింగ్ అథరిటీ ముందు ఈడీ ఫిర్యాదు చేసింది. సుమారు రూ. 22.88 కోట్ల విదేశీ చెల్లింపుల సమాచారం ఆలస్యంగా నివేదించడం, రూ. 23.31 కోట్ల విలువైన షేర్ల జారీ తర్వాత ఫారం ఎఫ్‌సీజీపీఆర్ దాఖలులో జాప్యం, రూ. 7.21 కోట్ల విలువైన షేర్ల కేటాయింపులో ఆలస్యం వంటి ఉల్లంఘనలు జరిగినట్టు ఈడీ తన ఫిర్యాదులో పేర్కొంది. దీంతో 2024 సెప్టెంబర్ 30న కంపెనీతో పాటు సంబంధిత డైరెక్టర్లకు అడ్జుడికేటింగ్ అథరిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆ తర్వాత, కంపెనీ ఫెమా సెక్షన్ 15 ప్రకారం ఉల్లంఘనల పరిష్కారానికి ఆర్బీఐకి కాంపౌండింగ్ కోసం దరఖాస్తు చేసుకుంది. ఆర్బీఐ సూచన మేరకు ఈడీ దీనికి అభ్యంతరం లేదని తెలిపింది. ఫలితంగా, రూ. 21.68 లక్షల జరిమానాను ఒక్కసారిగా చెల్లించాలనే షరతుతో ఆర్బీఐ కాంపౌండింగ్ ఆర్డర్ ఇచ్చింది. ఈ ఆదేశాలతో కంపెనీపై ఫెమా కింద కొనసాగుతున్న విచారణ ప్రక్రియతో పాటు తదుపరి న్యాయపరమైన చర్యలన్నింటికీ తెరపడినట్టు ఈడీ తన ప్రకటనలో స్పష్టం చేసింది.

# కొండగట్టు ప్రమాద బాధితులకు 1.12 కోట్ల సాయం

**అందజేసిన మంత్రి అడ్లూరి, ఎమ్మెల్యే సత్యం, కలెక్టర్.. ప్రజల కోసమే ప్రజా ప్రభుత్వం: మంత్రి అడ్లూరి**



మల్యాల, జనవరి 9 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు కోరి తెచ్చుకున్నారని, అందుకే ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. కొండగట్టు గుట్ట కింద గత నవంబర్ 29న జరిగిన అగ్నిప్రమాదంలో 31 మంది చిరు వ్యాపారుల దుకాణాలు కాలి బూడిద కాగా, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి బాధిత కుటుంబాలకు మంత్రి సీఎం సహాయనిధి నుంచి రూ.83.12లక్షలు, విద్యుత్ శాఖ నుంచి రూ.29 లక్షలు కేటాయించారు. మొత్తంగా రూ.1.12కోట్ల ఆర్థిక సహాయంతో పాటు డీఆర్డీఏ నుంచి రూ.10 లక్షల రుణాలను బాధిత కుటుంబాలకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అగ్నిప్రమాదం జరిగిన వెంటనే ముఖ్యమంత్రి కార్యాలయానికి సమాచారం ఇచ్చి, సీఎం రేవంత్‌రెడ్డిని తాను ఎమ్మెల్యే సత్యం కలిసి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరామన్నారు. అనేక నిబంధనలు అడ్డు వచ్చినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు మంజూరు చేశారని తెలిపారు. చిరువ్యాపారులు తమ వ్యాపారం యథవిధిగా చేసుకునేలా భవిష్యత్తులోనూ అండగా ఉంటామని మంత్రి భరోసా ఇచ్చారు. వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కోటి లింగాల దేవస్థానాలను కలుపుతూ టెంపుల్‌సిటీ కారిడర్‌గా రూపకల్పన చేస్తామని మంత్రి అడ్లూరి తెలిపారు. కొండగట్టు అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు. అలాగే గిరిప్రదక్షణ మార్గం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు.

**కష్టాల్లో ఉన్నవారికి అండగా ఉంటాం: సత్యం**

కొండగట్టు బస్సు ప్రమాదంలో 65మంది మృతి చెందినప్పటికీ గత పాలకులు కన్నెత్తికూడా చూడలేదని ఎమ్మెల్యే సత్యం ఆరోపించారు. తమ ప్రభుత్వంలో అగ్నిప్రమాదం జరిగిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన నెలరోజుల్లోనే ఆర్థిక సహాయం అందించి కష్టాల్లో ఉన్న వారికి అండగా ఉంటామని భరోసా కల్పించినట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఎలాంటి ఆపద వచ్చిన ప్రజలకు అండగా ఉండేందుకు తాము ముందుంటామని తెలిపారు. కొండగట్టు అబివృద్ధికి మాస్టర్‌ప్లాన్ తయారీ అవుతుందని తెలిపారు. గత పాలకులు కొండగట్టు అభివృద్ధికి రూ.500కోట్లు ఇస్తామని, వంద కోట్ల జీవో జారీ చేసి వంద రూపాయలు కూడా ఇవ్వలేదని విమర్శించారు. నిధులు ఇవ్వకుండా శిలాఫలకాలు వేసి అభివృద్ధిగా పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన కల్యాణ్‌ను వసతి కోసం అడగాగానే నిధులు మంజూరు చేయించారన్నారు. గిరిప్రదక్షణ కోసం కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ సత్యప్రసాద్, ఆర్డీవో మధుసూదన్, ట్రాన్స్‌కో ఎస్‌ఈ సుదర్శన్, సర్పంచ్ దారం ఆదిరెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ బత్తిని మల్లీశ్వరీ శ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ వసంత, ఎంపీడీవో స్వాతి తదితరులు పాల్గొన్నారు.



# క్యాట్‌లో విద్యార్థుల ప్రతిభ అభినందనీయం

హయత్ నగర్, జనవరి 9 (ఈవార్తలు): క్యాట్ ఒలంపియాడ్‌లో శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థుల ప్రతిభ అభినందనీయమని స్కూల్ ఏజీఎం వెంకటరెడ్డి అన్నారు. క్యాట్ ఒలంపియాడ్ లెవెల్ -2లో 59 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కన పర్చగా మరో 10 మంది 1000 క్యాష్ అవార్డు అందుకున్నారు. హయత నగర్ సాయి నగర్ బ్రాంచ్ శ్రీ చైతన్య స్కూల్ లో శుక్రవారం విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఏజీఎం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక వెలికి తీసేందుకు క్యాట్ ఒలంపియాడ్ ఉపయోగపడుతుందన్నారు. శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ అంజనీ దేవి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఏకాగ్రత పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆమె ఆకాంక్షంచారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ రఘు వంశీ, డీన్ రఘుపతి, సి బ్యాచ్ ఇన్ చార్జి సోమయ్య, ప్రైమరీ ఇన్ చార్జీ స్వరూప రాణి, ఒలంపియాడ్ ఇన్ చార్జి పూజ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉస్మానియా మెడికల్ కాలేజీలో హెూం-2026 సదస్సు ప్రారంభం




కోఠి/హైదరాబాద్, జనవరి 9 (ఈవార్తలు): యువ ఆర్థోపెడిక్ పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్యులు తమ నైపుణ్యాన్ని మరింత మెరుగుపరుచుకునేందుకు హెూమ్ -2026 సదస్సు ఎంతగానో దోహదం చేస్తుందని ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజారావు అన్నారు. శుక్రవారం కోటి మెడికల్ కళాశాల న్యూ అకాడమిక్ బ్లాక్ లో ఉస్మానియా ఆస్పత్రి ఆర్థోపెడిక్ విభాగం హెచ్ ఓ డి, హెూమ్ కన్వీనర్ డాక్టర్ పి ఎల్ శ్రీనివాస్ నేతృత్వంలో నిర్వహించిన మూడు రోజుల సదస్సు ను డాక్టర్ రాజారావు, ఉస్మాని ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ రాకేష్ సహాయి, డాక్టర్ బి. రామకృష్ణ, డాక్టర్ తిమ్మారెడ్డి, డాక్టర్ జి వి ఎస్ మూర్తి, డాక్టర్ రామ్ కిషన్, డాక్టర్. ఏ కృష్ణారెడ్డి లు జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు, ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో, డాక్టర్ రాజారావు మాట్లాడుతూ.. పీజీ వైద్యులకు, రోగులకు వైద్య చికిత్సలు అందించడంలో, వారి వ్యాధి నిర్ధారణ పరీక్ష లు, త్వరితగతిన తెలుసుకోవడంతో పాటు, రోగి వెంటనే కోలుకునే విధంగా మెరుగైన చికిత్సలు అందించేందుకు ఈ హెూమ్ సదస్సు ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. గత 24 సంవత్సరాలుగా, ఈ హెూమ్ సదస్సు విజయవంతంగా నిర్వహించుకుంటూ ఎంతోమంది యువ పీజీ వైద్యులను వైద్య చికిత్సలు అందించడంలో వారికి పలు అంశాల పైన అవగాహన కల్పించి సమాజంలో దేశానికి అవసరమయ్యే ఉత్తమ వైద్యులుగా తీర్చిదిద్దుతున్నట్లు వారు తెలిపారు. అనంతరం ఉస్మాని ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ రాకే సహాయ, మాట్లాడుతూ ఈ హెూమ్ సదస్సు వచ్చే సంవత్సరం సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించుకోబోతుశీడడం తనకు ఎంతగానో ఆనందాన్ని కలిగించిందన్నారు. అనంతరం హెూం కన్వీనర్ డాక్టర్ పి ఎల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈసారి దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి యువ పీజీ వైద్యులు 400కు పైగా ఈ హెూం సదస్సుకు హాజరవ్వడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఈ మూడు రోజులు సదస్సులో వైద్యులకు పలు అంశాల పై సీనియర్, రిటైర్డ్ హెచ్ ఓ డి లు, వైద్య చికిత్స అందించడంలో, సరికొత్త మెలకువలను, నేర్పిస్తారని ఆయన తెలిపారు. ఈసారి సీనియర్ వైద్యులు, గోపీనాథ్ మీనన్, జి సీతారామారావు, ఉదయ్ కుమార్, శివానంద్, నాగ మునింద్రుడు, వంటి వైద్యులు పాల్గొని తమ అనుభవాలను యువ పీజీ వైద్యులకు క్లుప్తంగా వివరిస్తారని డాక్టర్ పి ఎల్ శ్రీనివాస్ తెలిపారు, ఉదయం ప్రారంభమైన ఈ హెూం సదస్సు సాయంత్రం వరకు నిర్విరామంగా కొనసాగింది.

# అవంతి కాలేజీలో సంక్రాంతి సంబరాలు




బర్కత్‌పుర/హైదరాబాద్, జనవరి 9 (ఈవార్తలు): తెలుగువారికి అత్యంత ప్రీతిపాత్రమైన సంక్రాంతి సంబరాలు పండుగకు ముందే ప్రారంభమయ్యాయి. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు విద్యాసంస్థల నిర్వాహకులు కళాశాలల్లో సంక్రాంతి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం బర్కత్‌పురలోని అవంతి కళాశాలలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. సంప్రదాయ దుస్తుల్లో చూడముచ్చటగా ఉన్న విద్యార్థులు.. అంద మైన రంగవల్లులు, భోగి మంటలు, పొంగలి తయారు, డూడూ బసవన్నల కోలాహలంతో ఆద్యంతం ఆకట్టుకున్నాయి. సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి పండగ మనకు ఎంతో ప్రధానమైందని అవంతి విద్యా సంస్థల చైర్మన్, మాజీ మంత్రి ఎం.శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని చెప్పారు. విద్యార్థులు, యువతకు దేశ సంస్కృతిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విశేష ఆచార సంస్కృతులు నెలకొన్న దేశంలో జన్మించినందుకు ప్రతి ఒక్కరూ ఎంతో గర్వపడాలనిచెప్పారు. విద్యార్థులకు సంక్రాంతి పండుగ విశిష్టతను చాటేందుకు సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. మన పండగల వెనుక ఉండే రహస్యాలు తెలుసుకునేందుకు అందరూ ప్రయత్నించాలన్నారు. భవిష్యత్ తరాలకు మన పండుగల విశిష్టతను తెలియజేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. విదేశీయులు సైతం అనుసరిస్తున్న మన దేశ సంప్రదాయాలను కాపాడుకోవాలని సూచించారు. ఈసందర్భంగా వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఓయు కామర్స్ విభాగం హెచ్డి ప్రొఫెసర్ ప్యాట్రిక్స్, బ్రహ్మకుమారీస్ డాక్టర్ శ్రీలత, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ జయప్రద, ప్రొఫెసర్ రాకేష్, సాయి రామ్ తదితరులు పాల్గొన్నారు.



## పొదగకుండానే గుడ్డు నుంచి పిల్లలు

**ఇంక్యుబేటర్‌ను తయారుచేసిన నిరుపేద**

**రూ.2 వేలతోనే పరికరం తయారీ**

**కరీంనగర్ జిల్లా గర్శకుర్తికి చెందిన సంపత్ ఘనత**



గంగాధర, జనవరి 9 (ఈవార్తలు): గుడ్లపై కోడి పొదగకుండానే పిల్లలను ఉత్పత్తి చేసే ఇంక్యుబేటర్‌ను తయారు చేసి వహ్వా అనిపించాడో యువకుడు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తి గ్రామానికి చెందిన నిరుపేద యువకుడు కొలకాని సంపత్.. ఎనిమిదో తరగతి వరకు మాత్రమే చదువుకున్నాడు. దాంతో నాటు కోళ్ల పెంపకం చేపట్టాడు. అయితే, గుడ్లపై కోళ్లను పొదిగిస్తూ పిల్లలను పెంచడం ఆలస్యం అయ్యింది. ఈ పరిస్థితి అధిగమించేందుకు సంపత్ తన బుర్రకు పదును పెట్టాడు. యూట్యూబ్‌లోని ఇంక్యుబేటర్ల తయారీ విధానాన్ని తెలుసుకొని, తాను సొంతంగా తయారుచేయడం ప్రారంభించాడు. అలా విజయవంతంగా కోడి పొదిగే అవసరం లేకుండానే గుడ్డు నుంచి పిల్లలను పుట్టించేలా చేయగలిగాడు. ప్రస్తుతం ఆ పరికరాలకు మంచి గిరాకీ ఉండటంతో అమ్మకాలు కూడా ప్రారంభించాడు. ఇంక్యుబేటర్ తయారీకి రూ.2 వేల మాత్రమే అవుతుందని, తాను రూ.4 వేలకు అమ్ముతున్నట్లు సంపత్ తెలిపాడు. ఇప్పటికే ఉమ్మడి కరీంనగర్ మాత్రమే కాకుండా నిజామాబాద్, ఆదిలాబాద్ ప్రాంతాలవారికీ వందల సంఖ్యలో ఇంక్యుబేటర్లను అమ్మినట్లు పేర్కొన్నాడు.

## ఏపీ టెట్ ఫలితాలు విడుదల

విజయవాడ, జనవరి 9 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్-2025) ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఈ పరీక్షలో మొత్తం 39.27 శాతం మంది అభ్యర్థులు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది డిసెంబర్ 10 నుంచి 21 వరకు ఈ పరీక్షలను నిర్వహించిన సంగతి తెలిసిందే. ఏపీ టెట్ కన్వీనర్ వెంకట కృష్ణారెడ్డి ఫలితాల వివరాలను మీడియాకు వెల్లడించారు. టెట్‌కు మొత్తం 2,71,692 మంది దరఖాస్తు చేసుకోగా, 2,48,427 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 97,560 మంది అర్హత సాధించినట్లు ఆయన తెలిపారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల్లో ఉత్తీర్ణత శాతం కాస్త మెరుగ్గా నమోదైంది.



# టార్గెట్ ఆరోగ్య భారత్

**సంక్లిష్ట వ్యాధుల పరిష్కారం వైపు పయనం.. బయోటెక్నాలజీ, ఆరోగ్య రంగాలకు ప్రాధాన్యం**

**కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడి**




అరుదైన, జన్యు వ్యాధుల ముందస్తు గుర్తింపుతోపాటు అందుబాటు వ్యయంతో వాటికి చికిత్స చేయడం ఆరోగ్య సంరక్షణ రంగంలో నేడు అతిపెద్ద సవాళ్లని కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఓ కార్యక్రమం సందర్భంగా ప్రసంగిస్తూ- జన్యుశాస్త్రం, బయోటెక్నాలజీ, వ్యాధి నివారక ఆరోగ్య సంరక్షణ మార్గంలో సంక్లిష్ట ఆరోగ్య సమస్యల పరిష్కారానికి దేశం శాస్త్రీయంగా, ఆర్థికంగా సన్నద్ధమైందని తెలిపారు.

**హైదరాబాద్‌లోని డీబీటీ-బీఆర్ఐసీ సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్ (సీడీఎఫ్‌డీ)ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ 'సమర్థ్' జాతీయ నైపుణ్యాభివృద్ధి కేంద్రానికి శంకుస్థాపన చేయడంతోపాటు 'ఐడీఈఏ-ఎన్ఏ బీఆర్ఐసీ-సీడీఎఫ్‌డీ' టెక్నాలజీ ఇంక్యుబేటర్‌ను మంత్రి ప్రారంభించారు.**

హైదరాబాద్, జనవరి 9 (ఈవార్తలు):
మునుపటి దశాబ్దాల్లో అంటువ్యాధులతో పోరాడుతూ వచ్చిన దేశం.. ఇప్పుడు తదుపరి తరం ఆరోగ్య సంరక్షణ దశలోకి ప్రవేశించిందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఈ మేరకు మాలిక్యులర్ డయాగ్నస్టిక్స్, జీనోమ్ సీక్వెన్సింగ్, వ్యక్తిగతీకరించిన వైద్యం ఆరోగ్య సంరక్షణకు ప్రపంచ కూడలిగా మారుతున్నదని చెప్పారు. ప్రయోగశాలల్లో పరిశోధనల విజయాలను వాస్తవ జీవన పరీక్ష ఫలితాలతో అనుసంధానించడంలో 'సీడీపీఎఫ్‌డీ' వంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హయాంలో ప్రభుత్వ విధానాల దిశను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ఎర్రకోట పైనుంచి ఆయన ప్రసంగాల్లో పలుమార్లు ప్రధానంగా ప్రకటించిన మేరకు బయోటెక్నాలజీ, ఆరోగ్య రంగాలకు మునుపెన్నడూ ఎరుగని రీతిలో ప్రాధాన్యం లభిస్తున్నదని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో బయో-ఇ3 విధానాన్ని ఆయన ప్రకటించారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా శాస్త్రవేత్తలు, అంకుర సంస్థలు, యువ ఆవిష్కర్తలలో విస్తృత ఉత్సుకత ప్రేరేపించిందని వివరించారు. దేశం నేడు పెద్ద ఎత్తున జీనోమ్ సీక్వెన్సింగ్ ఆధారిత పీడియాట్రిక్ జన్యు వ్యాధుల కార్యక్రమాలు సహా హీమోఫీలియా వంటి పలు అంశాల్లో ప్రగతిశీల కృషితో భారత్ వేగంగా పురోగమిస్తున్నదని డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. ఇలాంటి వ్యాధులతో బాధపడుతున్న రోగులకు విభిన్న చికిత్స విధానాలు అవసరం కావచ్చునని, ఈ నేపథ్యంలో ప్రస్తుతం సాగుతున్న కృషి వ్యక్తిగతీకరించిన వైద్య శకానికి ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను సిద్ధం చేస్తున్నదని చెప్పారు. అరుదైన వ్యాధుల అంశాన్ని ప్రస్తావిస్తూ- దేశంలో ఈ వ్యాధుల చికిత్స సంబంధిత తొలి జాతీయ విధానాన్ని 2021లో ప్రవేశపెట్టింది మోదీ ప్రభుత్వమేనని ఆయన తెలిపారు. ప్రభుత్వ విధానాల్లో వినూత్న మార్పును సూచించడంతోపాటు దూరదృష్టి, సార్వత్రిక శాస్త్రీయ వనరులను ఇది ప్రతిబింబిస్తుందని మంత్రి అన్నారు. వ్యాధుల గుర్తింపు మాత్రమే సరిపోదని, బాధితులకు పటిష్ఠ చికిత్సను కూడా అందుబాటులోకి తేవాల్సి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ ద్వారా సంప్రదాయ వైద్య విధానాల సంస్థాగతీకరణతోపాటు యోగాను వ్యాధి నివారక ఆరోగ్య ఉపకరణంగా ప్రపంచం గుర్తించడం వెనుక ప్రభుత్వ ప్రోత్సహిస్తున్న సమగ్ర ఆరోగ్య సంరక్షణ నమూనాను కూడా మంత్రి ప్రస్తావించారు. అలాగే జీవనశైలి, జీవక్రియ రుగ్మతల నిర్వహణ దిశగా ఆరోగ్య శ్రేయో విధానాలను ఆధునిక వైద్యంతో జోడించడం సానుకూల ఫలితాలిచ్చిందని ఆయన అన్నారు. ఈ పర్యటన సందర్భంగా 'సీడీఎఫ్‌డీ'లో సాగుతున్న పరిశోధన-ఆవిష్కరణ కార్యకలాపాలను డాక్టర్ జితేంద్ర సింగ్ సమీక్షించారు. జీనోమ్ సీక్వెన్సింగ్ కార్యక్రమాలతోపాటు ప్రజలకు అవగాహన కల్పన లక్ష్యంగా చేపట్టిన కృషి తదితరాలను ప్రశంసించారు. బయోటెక్నాలజీపై విశ్వాసం, ఆసక్తిని పెంచడం కోసం పౌరులకు... ముఖ్యంగా యువతకు అర్థమయ్యే భాషలో శాస్త్రవిజ్ఞానాన్ని చేరువ చేయడం అత్యావశ్యకమని మంత్రి అన్నారు. దేశంలో బయోటెక్ అంకుర సంస్థల సంఖ్య కొన్నేళ్లుగా అనేక రెట్లు పెరిగిందని, భారత్‌లో బయో-ఆర్థిక వ్యవస్థ వికాసానికి ఈ రంగం ఎంతగానో తోడ్పడుతుందన్ని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. బయోటెక్నాలజీ పరిశోధన-ఆవిష్కరణ మండలి (బీఆర్ఐసీ) ఏర్పాటుతో సంస్థల మధ్య సమన్వయం బలోపేతమై, ఉన్నత-ప్రభావ పరిశోధనలతోపాటు పరిశ్రమ భాగస్వామ్యానికి దారితీసిందన్నారు. టీకాలు, వ్యాధి నివారక ఆరోగ్య సంరక్షణ రంగం పరంగా భారత్ ప్రపంచంలో అగ్రస్థానానికి చేరుతున్నదని మంత్రి స్పష్టం చేశారు. స్వదేశీ ఆవిష్కరణలు నేడు జాతీయంగా అమలు కావడంతోపాటు ప్రపంచ దేశాల మధ్య వాటి ఆదానప్రదానం కూడా సాగుతున్నదని తెలిపారు. ఆ మేరకు ప్రపంచ ఆరోగ్య భద్రతలో భారత్ పాత్ర మరింత బలోపేతం అవుతున్నదని పేర్కొన్నారు. చివరగా- దేశ జనాభాలో దాదాపు 70 శాతం మంది 40 ఏళ్లలోపు వయస్కులేనని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. అందువల్ల ముందస్తు రోగ నిర్ధారణ, వ్యాధి నివారక ఆరోగ్య రంగంపై నిశితంగా దృష్టి సారించడం జాతీయ స్థాయిలో అత్యావశ్యకమని ఆయన స్పష్టం చేశారు. ఈ దిశగా సీడీఎఫ్‌డీ పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఇటువంటి సంస్థలు ఆరోగ్యకర, బలమైన, భవిష్యత్ సంసిద్ధ భారత్ రూపకల్పనలో అర్థవంతంగా దోహదం చేస్తున్నాయని పేర్కొన్నారు.

## 63 మంది మావోయిస్టుల లొంగుబాటు

బస్తర్: ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో మావోయిస్టు ఉద్యమానికి భారీ ఎదురుదెబ్బ తగిలింది. శుక్రవారం దంతెవాడలో జరిగిన ఒక కార్యక్రమంలో 18 మంది మహిళలు సహా మొత్తం 63 మంది మావోయిస్టులు భద్రతా బలగాల ముందు లొంగిపోయారు. వీరిలో 36 మందిపై మొత్తం రూ.1.19 కోట్ల రివార్డు ఉండటం గమనార్హం.దంతెవాడ జిల్లా రిజర్వ్ గార్డ్ (డీఆర్జీ) కార్యాలయంలో ఈ లొంగుబాటు కార్యక్రమం జరిగింది. హింసను వీడి జనజీవన



స్రవంతిలో కలిసేలా మావోయిస్టులను ప్రోత్సహించేందుకు దంతెవాడ పోలీసులు చేపట్టిన 'పున మర్గం' (పునరావాసం - పునరుజ్జీవనం) ప్రచారమే ఈ భారీ లొంగుబాటుకు కారణమని అధికారులు తెలిపారు. డీఆర్జీ, బస్తర్ ఫైటర్స్, సీఆర్పీఎఫ్ బలగాలు వీరిని లొంగిపోయేలా చేయడంలో కీలక పాత్ర పోషించాయి. లొంగిపోయిన వారిలో దర్భా డివిజన్, దక్షిణ బస్తర్, పశ్చిమ బస్తర్, మాడ్ డివిజన్‌లతో పాటు ఒడిశాలో పనిచేసిన వారు కూడా ఉన్నారు. వీరిలో డివిజనల్ కమిటీ సభ్యులు (డీవీసీఎమ్) మోహన్ కడ్తీ, సుమిత్రా కడ్తీ, పీపుల్స్ పార్టీ కమిటీ సభ్యురాలు (పీపీసీఎమ్) హంగీ వంటి కీలక నేతలు ఉన్నారు. వీరిపై గతంలో అనేక దాడులు, హత్యలు, ఐఈడీ పేలుళ్లు, ఆస్తుల ధ్వంసం వంటి కేసులు నమోదై ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ నక్సల్ పునరావాస విధానం ప్రకారం, లొంగిపోయిన వారికి రూ. 50,000 తక్షణ సహాయంతో పాటు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ, వ్యవసాయ భూమి, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని అధికారులు వివరించారు. ఈ లొంగుబాటు బస్తర్‌ను నక్సల్ రహిత ప్రాంతంగా మార్చే ప్రయత్నాల్లో ఒక పెద్ద విజయమని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పట్టిలింగం పేర్కొన్నారు.

# ట్రంప్‌కు మోదీ ఫోన్ చేయట్లే!

**నేరుగా మాట్లాడేందుకు నిరాకరిస్తున్నారు.. మోదీ వల్లే ట్రేడ్ డీల్ ఆలస్యం: అమెరికా మంత్రి**

వాషింగ్టన్: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఫోన్ చేయకపోవడం వల్లే భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదరలేదని అమెరికా వాణిజ్య మంత్రి హొవార్డ్ లుట్నిక్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్-అమెరికా ట్రేడ్ డీల్ చర్చల సమయంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కార్యరూపం దాల్చకపోవడానికి విధానపరమైన అడ్డంకులు కారణం కాదని ఆయన స్పష్టం చేశారు. అధ్యక్షుడు ట్రంప్‌తో ప్రధాని మోదీ నేరుగా మాట్లాడేందుకు నిరాకరించడమే అసలు కారణమని ఆయన పేర్కొన్నారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లపై అసంతృప్తిగా ఉన్నానని, ఢిల్లీపై అధిక సుంకాలు విధిస్తామని ట్రంప్ చేసిన వ్యాఖ్యల అనంతరం అమెరికా వాణిజ్య శాఖ మంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మామూలుగా అయితే ఒప్పందం కొలిక్కి వచ్చిందని, ఇది ట్రంప్ ఒప్పందమని చెప్పవచ్చునని ఆయన అన్నారు. దానికి ముగింపు రావాలంటే ట్రంప్‌నకు మోదీ ఫోన్ చేయాల్సిందేనని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే ఇది భారత ప్రభుత్వానికి రుచించలేదని, మోదీ ఫోన్



కూడా చేయలేదని ఆయన తెలిపారు. ఇండోనేసియా, ఫిలిప్పీన్స్, వియత్నాంతో వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నామని, వాటి కంటే భారత్‌తోనే ముందు ఒప్పందం ఖరారవుతుందని భావించామని ఆయన అన్నారు. అలా జరగకపోవడంతో ఇంతకుముందు అంగీకరించిన వాణిజ్య ఒప్పందాన్ని అమెరికా వెనక్కి తీసుకుందని, ప్రస్తుతం దానిపై ఆలోచన చేయడం లేదని ఆయన స్పష్టం చేశారు. బ్రిటన్‌తో వాణిజ్య ఒప్పందం చర్చలు కొలిక్కి వస్తోన్న సమయంలో ఆ దేశ ప్రధాని కీర్‌స్మార్టర్ ట్రంప్‌నకు ఫోన్ చేశారని ఆయన గుర్తు చేశారు. దాంతో అదే రోజు డీల్ ముగిసిందని, మరుసటి రోజు ఇరువురు నేతలు మీడియా సమావేశంలో ప్రకటన చేశారని తెలిపారు. మోదీ ఫోన్ చేయడానికి నిరాకరించినప్పటికీ, ఇంకా ఫోన్ చేయడానికి ఆయనకు అవకాశం ఉందని హొవార్డ్ లుట్నిక్ పేర్కొన్నారు.

# పరం రుద్ర ప్రారంభం





**ఐఐటీ బాంబేలో సూపర్ కంప్యూటర్ స్టార్ట్**

ముంబై: సూపర్ కంప్యూటింగ్ రంగంలో భారత్ మరో కీలక ముందడుగు వేసింది. పూర్తిగా దేశీయ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 'పరం రుద్ర' సూపర్ కంప్యూటింగ్ వ్యవస్థను ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) బాంబేలో ప్రారంభించారు. ఇక్కడి సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీ-డాక్) కేంద్రంలో ఈ వ్యవస్థను ఏర్పాటు చేశారు. 3 పెటా ఫ్లాప్స్ అత్యధిక పనితీరు సామర్థ్యం (హెచ్‌పీసీ) కలిగిన ఈ సూపర్ కంప్యూటర్‌ను నేషనల్ సూపర్ కంప్యూటింగ్ మిషన్ (ఎన్ఎస్ఎం) కింద అభివృద్ధి చేశారు. 'పరం రుద్ర' వ్యవస్థను సీ-డాక్ స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన రుద్ర సర్వర్ల ఆధారంగా నిర్మించారు. దీని తయారీ కూడా పూర్తిగా భారత్‌లోనే జరగడం 'మేకిన్ ఇండియా' స్ఫూర్తిని బలపరుస్తోంది. సీ-డాక్ అభివృద్ధి చేసిన సాఫ్ట్‌వేర్‌తో పాటు మెరుగైన పనితీరు కోసం అధునాతన డైరెక్ట్ కాంటాక్ట్ లిక్విడ్ కూలింగ్ (డీసీఎల్‌సీ) టెక్నాలజీని ఇందులో పొందుపరిచారు. ఈ సందర్భంగా సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం (డీఎస్‌టీ) కార్యదర్శి ప్రొఫెసర్ అభయ్ కరందికర్ మాట్లాడుతూ, "ఈ సూపర్ కంప్యూటర్ ద్వారా ఐఐటీ బాంబేలోని 200 మంది అధ్యాపకులు, 1,200 మంది విద్యార్థులతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న పరిశోధకులకు ఎంతో మేలు జరుగుతుంది" అని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బయోటెక్నాలజీ వంటి రంగాల్లో ఆవిష్కరణలకు ఇది ఊతమిస్తుందని ఆయన వివరించారు. స్వదేశీ సూపర్ కంప్యూటింగ్ ప్రస్థానంలో ఇది ఒక మైలురాయి అని ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ మంత్రిత్వ శాఖ గ్రూప్ కోఆర్డినేటర్ సునీతా వర్మ అన్నారు. ఐఐటీ బాంబేలో ఏర్పాటు చేసిన కేంద్రంతో కలిపి, దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 38 సూపర్ కంప్యూటర్లను ఏర్పాటు చేశామని, వాటి మొత్తం సామర్థ్యం 44 పెటా ఫ్లాప్స్‌కు చేరిందని ఎన్ఎస్ఎం మిషన్ డైరెక్టర్ డాక్టర్ హేమంత్ దర్బారీ తెలిపారు. నేషనల్ సూపర్ కంప్యూటింగ్ మిషన్‌ను కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మరియు సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తుండగా, సీ-డాక్, ఐఐఎస్‌సీ బెంగళూరు దీనిని అమలు చేస్తున్నాయి.

## వణికిన గుజరాత్

**గంటల వ్యవధిలోనే 12 సార్లు ప్రకంపనలు**

**రిక్టర్ స్కేలుపై తీవ్రత 2.6 నుంచి 3.8 మధ్య నమోదు**



గాంధీనగర్: గుజరాత్‌లోని సౌరాష్ట్ర ప్రాంతంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు 12 సార్లకు పైగా భూప్రకంపనలు సంభవించడంతో రాజ్‌కోట్ జిల్లాలో భయాందోళనలు నెలకొన్నాయి. చాలామంది ఇళ్ల నుంచి బయటకు వచ్చి బహిరంగ ప్రదేశాల్లోనే ఉండిపోయారు. అయితే ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. ఈ ప్రకంపనల తీవ్రత రిక్టర్ స్కేలుపై 2.6 నుంచి 3.8 మధ్య నమోదయింది. పాత భవనాల్లోని కొన్ని పాఠశాలలకు అధికారులు సెలవులు ప్రకటించారు. శిథిలావస్థలో ఉన్న నిర్మాణాల నుంచి ప్రజలు బయటకు రావాలని అధికారులు సూచించారు. గంటల వ్యవధిలోనే పలుమార్లు భూమి కంపించడంతో ప్రజలు భయపడి ఇళ్లలో నుంచి బయటకు పరుగు తీశారు. ఉప్లేటా, ధొరాజీ, జెత్‌పూర్ తాలుకాల్లో ఈ ప్రకంపనలు సంభవించాయి. గురువారం రాత్రి 8.42 గంటల ప్రాంతంలో తొలిసారి భూమి కంపించిందని రాజ్‌కోట్ జిల్లా కలెక్టర్ తెలిపారు. భూకంప కేంద్రం ఉప్లేటా పట్టణంలో ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు. భూమి పొరల్లో అప్పటికే ఉన్న చీలికల మధ్యకు నీరు చేరి ఒత్తిడి తీవ్రమైనప్పుడు ఇలా భూమి పలుమార్లు కంపిస్తుందని ఆయన వివరించారు.

## గాజాలో పాక్ సైన్యం వద్దు

**నమ్మకం లేని దేశాలతో పనిచేయలేం: ఇజ్రాయెల్**

గాజా: గాజాలో శాంతిని పర్యవేక్షించేందుకు ఉద్దేశించిన అంతర్జాతీయ బలగాల్లో పాకిస్థాన్ సైన్యాన్ని కూడా చేర్చాలన్న ప్రతిపాదనను ఇజ్రాయెల్ తీవ్రంగా వ్యతిరేకించింది. తాము విశ్వసించని, సరైన దౌత్య సంబంధాలు లేని దేశాలతో కలిసి పనిచేయలేమని స్పష్టం చేసింది. అమెరికా ప్రతిపాదించిన ఇంటర్నేషనల్ స్టెబిలైజేషన్ ఫోర్స్‌లో పాకిస్థాన్ సైన్యాన్ని కూడా భాగం చేయాలని వాషింగ్టన్ భావిస్తున్న నేపథ్యంలో ఇజ్రాయెల్ ఈ మేరకు తన అధికారిక వైఖరిని వెల్లడించింది. భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ ఎన్డీటీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాలను వెల్లడించారు. "మేము నమ్మకంగల దేశాలతోనే కలిసి పనిచేయగలం. పాకిస్థాన్‌తో మాకు అలాంటి సంబంధాలు లేవు" అని ఆయన తేల్చిచెప్పారు. పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే లష్కర్-ఏ-తోయిబా, జైష్-ఏ-మహమ్మద్ వంటి ఉగ్రవాద సంస్థలతో హమాస్‌కు సంబంధాలు బలపడుతున్నాయని ఇజ్రాయెల్ ఆందోళన వ్యక్తం చేసింది. గత మూడేళ్లుగా హమాస్ సీనియర్ కమాండర్ నజీ జహీర్ తరచూ పాకిస్థాన్‌లో పర్యటించి ఆయా సంస్థల ప్రతినిధులతో సమావేశమవుతున్నట్లు తమ వద్ద ఇంటెలిజెన్స్ సమాచారం ఉందని అజార్ పేర్కొన్నారు. గాజాలో ఎలాంటి రాజకీయ పరిష్కారం లేదా పునర్నిర్మాణం చేపట్టాలన్నా ముందుగా హమాస్‌ను పూర్తిగా నిర్మూలించడం తప్పనిసరి అని ఇజ్రాయెల్ గట్టిగా చెబుతోంది. హమాస్ ఉనికిలో ఉండగా శాంతి పరిరక్షణ దళాలను పంపడంలో అర్థం లేదని, హమాస్‌తో పోరాడటానికి చాలా దేశాలు సిద్ధంగా లేవని ఆయన గుర్తుచేశారు. ఈ అంశంపై ఇజ్రాయెల్ ఇంత బహిరంగంగా, అధికారికంగా స్పందించడం ఇదే మొదటిసారి.

## ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడి

**మిసైళ్లు, డ్రోన్లతో విరుచుకుపడ్డ రష్యా**


**ధ్వని వేగం కంటే 10 రెట్లు వేగంగా ప్రయాణించే క్షపణి ప్రయోగం**

మాస్కో: రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మరింత ఉద్రిక్త స్థాయికి చేరుకుంది. గత రాత్రి పశ్చిమ లివివ్ పై రష్యా భారీ దాడులు చేసింది. ఇందులో అత్యాధునిక ఒరెష్నిక్ బాలిస్టిక్ క్షపణిని ప్రయోగించింది. దీన్ని ఈ యుద్ధంలో ప్రయోగించడం రెండోసారి అని తెలుస్తోంది. రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకారం, ఇది పుతిన్ నివాసంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడి ప్రయత్నానికి ప్రతీకారంగా చేసింది. ఒరెష్నిక్ క్షపణి ధ్వని వేగం కంటే 10 రెట్లు (గంటకు సుమారు 13,000 కి.మీ.) వేగంగా ప్రయాణిస్తుంది. ఇది ఇంటర్మీడియట్-రేంజ్ బాలిస్టిక్ మిసైల్. అణు లేదా సాధారణ వార్‌హెడ్‌లు మోసుకెళ్లగలదు. యూరప్ మొత్తం దీని పరిధిలోకి వస్తుందని, ఇప్పటి వరకు దీన్ని అడ్డుకునే ఆయుధాలు లేవని రష్యా ప్రకటించింది. మొత్తం దాడిలో రష్యా 36 క్షపణులు (ఇందులో ఒరెష్నిక్ ఒకటి), 242 డ్రోన్లు ప్రయోగించింది. ఉక్రెయిన్ ఎయిర్ ఫోర్స్ చాలా డ్రోన్లు, కొన్ని క్షపణులను అడ్డుకుంది. ఈ దాడుల్లో నలుగురు మరణించారు, 22 మంది గాయపడ్డారు (ఇందులో ఒక పారామెడిక్, రెస్క్యూ వర్కర్లు కూడా). రెసిడెన్షియల్ భవనాలు, ఎనర్జీ సదుపాయాలు దెబ్బతిన్నాయి. నాటో సరిహద్దుకు సమీపంలో ఒరెష్నిక్ పడిందని... ఇది ఐరోపా భద్రతకు పెను ముప్పని ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి అన్నారు.

# సోమనాథ్ గుడిలో 363 మంది స్త్రీలు

**మహిళా సాధికారతకు నెలవుగా ఆలయం**

సోమనాథ్: భారతదేశ సాంస్కృతిక వారసత్వం, ఆధ్యాత్మిక చైతన్యానికి కేంద్రమైన సోమనాథ్ ఆలయం ప్రపంచవ్యాప్తంగా భక్తి కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. అయితే, ఈ ఆలయం కేవలం పూజ, దర్శనానికే పరిమితం కాకుండా, నేడు మహిళా సాధికారతకు శక్తివంతమైన కేంద్రంగా అవతరించింది. ఆలయ పరిపాలన నిర్వహణకు నోడల్ బాడీ అయిన సోమనాథ్ ట్రస్ట్, వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తోంది. వీరిలో 350 మందికి పైగా మహిళలు ఈ ఆలయంలో బహుళ సేవలలో నిమగ్నమై ఉన్నారు. ఆలయ నిర్వహణ, పారిశుద్ధ్యం, ప్రసాద పంపిణీ, భోజన సేవ వంటి వివిధ విభాగాల్లో వందలాది మంది మహిళలు పని చేస్తున్నారు. ప్రస్తుతం, సోమనాథ్ ఆలయ ట్రస్ట్‌లో మొత్తం 906 మంది ఉద్యోగులు సేవలను అందిస్తున్నారు. వీరిలో 262 మంది మహిళలు ఉన్నారు. ఇక ఆలయ ప్రాంగణంలోని బిల్వ అడవిని పూర్తిగా మహిళలు నిర్వహిస్తున్నారు. అక్కడ పనిచేస్తున్న 16 మంది మహిళలు పర్యావరణ పరిరక్షణ, హరిత కార్యక్రమాలు, పరిశుభ్రతపై దృష్టి సారించడం ద్వారా ఆలయ పవిత్రతను కాపాడుతున్నారు. ఈ ఏర్పాటు సమర్థవంతమైన నిర్వహణకు ఉదాహరణగా నిలుస్తోంది. ఆలయ భోజనశాలలో సుమారు 30 మంది మహిళలు సేవలందిస్తున్నారు. ప్రసాదం పంపిణీ కేంద్రం వద్ద 65 మంది మహిళలు ఉన్నారు. మొత్తం మీద, సోమనాథ్ ఆలయ ట్రస్ట్ ద్వారా 363 మంది మహిళలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. ఈ మహిళలు స్థిరమైన ఆదాయాన్ని పొందడం ద్వారా వారి ఆర్థిక



స్వాతంత్ర్యానికి మద్దతు లభిస్తోంది. తద్వారా వారి జీవన ప్రమాణాలు మరుగుపడుతున్నాయి. ఆలయ సేవలో మహిళలను భాగస్వాములను చేస్తున్న ఈ చర్య సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది.

ఈవార్తలు
వినోదవాణి CINEMA
శనివారం 10-1-2026 www.evarthalu.com


## వయ్యారి చిత్రం



# టికెట్ రేట్ పాలసీ ఎక్కడ?

### ప్రతి సినిమాకు ఇదే లొల్లి
### రేట్ల పెంపు జీవో రావడం..
### హైకోర్టులో చుక్కెదురవడం!







స్టార్ హీరో ప్రభాస్ నటించిన భారీ మూవీ ది రాజా సాబ్ వ్యవహారం మరోసారి తెలుగు రాష్ట్రాల్లో సినిమా టికెట్ రేట్ల విధానంలో ఉన్న లోపాలను స్పష్టంగా బయటపెట్టింది. తెలంగాణలో అనుమతులు లేట్ అవ్వడం వల్ల సినిమా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రాగా, ఆంధ్రప్రదేశ్ లో మాత్రం ముందుగానే అనుమతులు రావడం కొంత ఊరటగా మారింది. అయితే ఇది ఒక్క సినిమాకు సంబంధించిన సమస్య మాత్రమే కాదు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇప్పటికీ పూర్తిస్థాయి, పర్మినెంట్ టికెట్ రేట్ల పాలసీ లేకపోవడమే అసలు సమస్య అని టాక్ వినిపిస్తోంది. రాజా సాబ్ విడుదల సందర్భంగా తెలంగాణలో టికెట్ ధరలపై చివరి నిమిషం వరకు కూడా స్పష్టత రాలేదు. ప్రీమియర్ షోలు పడాల్సిన సమయంలోనూ ప్రభుత్వం నుంచి అనుమతులు రాకపోవడంతో థియేటర్ల యజమానులు, డిస్ట్రిబ్యూటర్లు అయోమయంలో పడ్డారు. చివరకు అర్ధరాత్రి సమయంలో జీవో జారీ అయింది. 10 రోజుల పాటు టికెట్ ధరలు పెంచుకునే అనుమతి ఇచ్చినా, అప్పటికే పడాల్సిన షోలు రద్దు కావడంతో నిర్మాతలకు నష్టం వాటిల్లిందని వాదన ఉంది. విడుదలకు ముందు చేసిన ప్లానింగ్ మొత్తం తారుమారు కావడంతో అంతా గందరగోళం ఏర్పడింది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ లో పరిస్థితి వేరేగా కనిపించింది. అక్కడ రాజా సాబ్ కు సంబంధించి టికెట్ ధరల అనుమతులు ముందుగానే రావడంతో అంతా సాఫీగా జరిగింది. అయితే ఒకే సినిమా.. రెండు రాష్ట్రాల్లో రెండు రకాల అనుభవాలు అన్నట్టుగా పరిస్థితి మారింది. అలా అని ఏపీలో పూర్తిస్థాయి పాలసీ ఉందని చెప్పలేం అన్నదే సినీ వర్గాల అభిప్రాయం. వాస్తవానికి ఆంధ్రప్రదేశ్ లోనూ సినిమా టికెట్ ధరలపై ఇప్పటికీ సరైన విధానం లేదు. గతంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఓ విధానం రూపొందించేందుకు ప్రయత్నించింది. కానీ కొన్ని కారణాల వల్ల అది పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయింది.



# నవదీప్ డ్రగ్స్ కేసు కొట్టివేత

డ్రగ్స్ కేసులో నటుడు నవదీప్‌కు పెద్ద ఊరట లభించింది. ఆయనపై నమోదైన డ్రగ్స్ కేసును తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. గుడిమల్కాపూర్‌లో నమోదైన ఈ కేసులో నవదీప్ వద్ద ఎలాంటి మత్తుపదార్థాలు దొరకలేదన్న అంశాన్ని కోర్టు స్పష్టంగా గుర్తించింది. నవదీప్ తరఫున వాదనలు వినిపించిన అడ్వొకేట్ వెంకట సిద్ధార్థ్ మాట్లాడుతూ.. ఈ కేసులో నవదీప్ పేరు కేవలం ఎఫ్ఐఆర్ లో మాత్రమే ఉందని, సంఘటన జరిగిన ప్రదేశంలో ఆయన వద్ద డ్రగ్స్ ఏవీ లభించలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. స్పాట్‌లో స్వాధీనం చేసుకున్న వస్తువుల్లో నవదీప్‌కు సంబంధించిన ఆధారాలు లేవని వివరించారు. ఈ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు.. సరైన ఆధారాలు లేకుండా కేసు కొనసాగించడం సరికాదని పేర్కొంది. నవదీప్ వద్ద డ్రగ్స్ లభించనందున, ఆయనపై నమోదైన కేసును కొట్టివేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ తీర్పుతో నవదీప్‌కు చట్టపరంగా పెద్ద ఊరట లభించినట్టయింది.

# మగ దర్శకుల కంటే గ్రేట్

### టాక్సిక్ డైరెక్టర్‌కు ఆర్జీవీ ప్రశంస



రాకింగ్ స్టార్ యశ్ కథనాయకుడిగా నటిస్తున్న 'టాక్సిక్ణ సినిమా టీజర్ ఇండస్ట్రీలో ప్రకంపనలు సృష్టిస్తోంది. నిన్న యశ్ బర్త్‌డే సందర్భంగా విడుదలైన ఈ టీజర్, సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలుస్తూ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం, టీజర్‌తోనే తన మేకింగ్ స్టైల్‌ను బలంగా పరిచయం చేశారు. ముఖ్యంగా ఒక మహిళా దర్శకురాలు ఇంతటి రా, రస్టిక్ యాక్షన్ కాన్సెప్ట్‌ను తెరకెక్కించడంపై సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ వర్మ చేసిన వ్యాఖ్యలు మరింత వేడిని రాజేశాయి. 'టాక్సిక్ణ టీజర్‌ను ప్రశంసిస్తూ తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేసిన వర్మ, దర్శకురాలు గీతూ మోహన్‌దాస్‌ను ఆకాశానికెత్తేశారు. "ఇది మహిళా సాధికారతకు నిలువెత్తు ఉదాహరణ" అని పేర్కొంటూ, ఇంత పవర్‌ఫుల్ విజువల్స్ సృష్టించడంలో ఆమె చాలా మంది మగ దర్శకుల కంటే ముందున్నారని అన్నారు. ఆమె విజన్‌కు తాను ఆశ్చర్యపోయానని వర్మ వ్యాఖ్యానించారు. టీజర్‌లో చూపిన విజువల్స్ విమర్శకుల ప్రశంసలు అందుకుంటున్నాయి. శ్మశానంలో అంత్యక్రియల సన్నివేశం, మాఫియా డాన్‌లు, లగ్జరీ కారులో యశ్ స్టైలిష్ ఎంట్రీ, ఆ వెంటనే జరిగే పేలుడు.. ఈ మొత్తం సీక్వెన్స్‌ను ఎంతో స్టైలిష్‌గా చిత్రీకరించారని మెచ్చుకుంటున్నారు.



# శుభవార్త చెప్తా.. కానీ గర్భవతిని కాదు: అవికా గోర్

ఇటీవల అవికా గోర్ సోషల్ మీడియాలో పెట్టిన ఒక చిన్న పోస్ట్ పెద్ద చర్చకు దారి తీసింది. 'కొత్త ప్రారంభం' అనే క్యాప్షన్‌తో ఆమె షేర్ చేసిన పోస్ట్‌ను చూసి, అవికా తల్లి కాబోతున్నారంటూ సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి. కొందరు అభిమానులు శుభాకాంక్షలు చెప్పడం మొదలుపెట్టగా, మరికొందరు ఇది ఒక హింట్ అని భావించారు. అయితే ఈ ప్రచారంపై తాజాగా అవికా స్పష్టమైన క్లారిటీ ఇచ్చారు. తన గురించి వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని అవికా గోర్ ఖండించారు. తాను తల్లి కాబోతున్నానన్న ప్రచారం పూర్తిగా రూమర్స్ మాత్రమేనని చెప్పారు. అసత్యమైన విషయాలను ఎందుకు ఇంత వేగంగా షేర్ చేస్తున్నారో అర్థం కావడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న మాట లేదా పోస్ట్ చూసి అభిమానులు వెంటనే ఒక నిర్ణయానికి వచ్చేస్తున్నారని అన్నారు. ఇలాంటి వార్తలు తనను అసౌకర్యానికి గురిచేస్తున్నాయని కూడా తెలిపారు. అయితే, అదే సమయంలో ఒక విషయం మాత్రం ఆసక్తికరంగా మారింది. నిజంగానే తన జీవితంలో ఒక పెద్ద శుభవార్త ఉందని అవికా చెప్పారు.

# ట్రెండింగ్‌లో టాక్సిక్ బ్యూటీ నటాలీ బర్న్



గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో కన్నడ నటుడు యష్ హీరోగా నటిస్తున్న టాక్సిక్ మూవీ నుండి హీరో పుట్టినరోజు సందర్భంగా హీరో ఇంట్రడక్షన్ వీడియో విడుదల చేశారు ఇందులో యష్.. రాయ అనే పాత్రలో నటిస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన హీరో ఇంట్రడక్షన్ వీడియోలో యష్ ఒక విదేశీ నటితో కలిసి నటించిన కారు సీను వైరల్ అవుతోంది. పైగా ఆ విదేశీ నటి అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ నేపథ్యంలోనే ఈమె ఎవరు? ఈమె బ్యాక్ గ్రౌండ్ ఏంటి ? అసలు ఈమె ఎక్కడి నుంచి వచ్చింది? అనే విషయాలు తెలుసుకోవడానికి నెటిజన్స్ తెగ వెతికేస్తున్నారు. మరి ఈమె ఎవరు? ఈమె నేపథ్యం ఏమిటి? అని వెతుకుతున్నారు. ఈమె పేరు నటాలీ బర్న్. ఉక్రెయిన్- అమెరికన్ నటి. 2006 నుండి హాలీవుడ్ చిత్రాలలో పనిచేస్తోంది. ఉక్రెయిన్ లోని కైవ్ లో నటాలీయ గుస్లిష్ఛాయాగా జన్మించింది. ఇక సినిమాల మీద ఇష్టంతో అమెరికాకు వెళ్ళిపోయిన ఈమె.. అక్కడే సినిమాలు చేస్తూ సెటిల్ అయిపోయింది. ది ఎక్స్ పెండబుల్స్ 3, మెకానిక్ రిసరెక్షన్ వంటి యాక్షన్ చిత్రాలలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ది కం బ్యాక్ ట్రైల్, ఐస్ ఇన్ ది ట్రీస్ వంటి థ్రిల్లర్ చిత్రాలలో కూడా నటించి ఆకట్టుకుంది. నటి మాత్రమే కాదు నిర్మాతగా, మార్షల్ ఆర్టిస్ట్ గా కూడా మంచి పేరు దక్కించుకుంది. ప్రస్తుతం కన్నడ చిత్రమైన టాక్సిక్ సినిమాలో నటాలీ బర్న్ నటించడమే కాకుండా సహానిర్మాతగా కూడా పనిచేస్తోంది. ఇకపోతే నిర్మాతగా ఇప్పటికే పలు చిత్రాలను నిర్మించిన ఈమె అటు మార్షల్ ఆర్ట్స్ లో కూడా మంచి శిక్షణ పొందింది. పైగా నాలుగు భాషలు కూడా మాట్లాడగలదు. ఇకపోతే తొలిసారి ఇండియన్ సినిమాలో నటించడమే కాకుండా నిర్మాతగా కూడా వ్యవహరిస్తోంది.

# జన నాయగన్‌కు బ్రేక్



తమిళ స్టార్ హీరో థళపతి విజయ్ నటించిన 'జన నాయగన్ణ సినిమా సెన్సార్ సమస్యల నుంచి ఇంకా బయటపడలేకపోతోంది. ఈ అంశం ప్రస్తుతం న్యాయస్థానంలో ఉండగా, శుక్రవారం జస్టిస్ పి.టి.ఆశా సెన్సార్ బోర్డు వెంటనే సర్టిఫికెట్ జారీ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. అయితే సీబీఎఫ్‌సీ దీనిపై అభ్యంతరం తెలుపుతూ, చీఫ్ జస్టిస్ మనీంద్ర మోహన్ శ్రీవాస్తవ, జస్టిస్ జి. అరుల్ మురుగన్‌లతో కూడిన ఫస్ట్ డివిజన్ బెంచ్ ముందు రిట్ అప్పీల్ దాఖలు చేసింది. అయితే, తాజా సమాచారం ప్రకారం, మద్రాస్ హైకోర్టు చీఫ్ జస్టిస్ సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలను తాత్కాలికంగా నిలిపివేశారు. అంటే విజయ్ చిత్రానికి యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలన్న ఆదేశంపై స్టే విధించారు. ఈ కేసుకు సంబంధించిన తదుపరి విచారణను పొంగల్ సెలవుల అనంతరం, జనవరి 21కు వాయిదా వేశారు.



# టాలీవుడ్‌పై ఆశలు

శ్రీదేవి తనయురాలు జాన్వీ కపూర్ కెరీర్ ఆశించిన స్థాయిలో సాగట్లేదు. దఢక్ తో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చి రెండు మూడు సినిమాల దాకా హడావిడి చేసిన ఈ అమ్మడు ఆ తర్వాత ఎందుకో కెరీర్ మీద అంత గ్రిప్ సాధించలేకపోయింది. ఇక సౌత్ ఎంట్రీగా తెలుగులో ఎన్టీఆర్ తో దేవర సినిమా చేసింది ఈ అమ్మడు. ఐతే ఆ సినిమాలో తంగం పాత్రలో జస్ట్ సాంగ్స్ కోసం తప్ప అమ్మడిని సరిగా వాడుకోలేదు. ఐతే దేవర 2 వస్తుందని ఎదురుచూడటం తప్ప చేసేదేమి లేకుండా పోయింది. ఈలోగా చరణ్ బుచ్చి బాబుతో చేస్తున్న పెద్ది సినిమాలో ఛాన్స్ అందుకుంది అమ్మడు. ఏడాది కాలంగా ఆ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. చరణ్, జాన్వి కపూర్ జోడీ చిరంజీవి, శ్రీదేవి జంటని తలపించేలా ఉంటుందని అంటున్నారు. జాన్వి కపూర్ కూడా పెద్దితో ఒక మంచి బ్రేక్ రావాలని కోరుకుంటుంది. అమ్మడు లాస్ట్ ఇయర్ హిందీలో 3 సినిమాలు చేసింది. అందులో హొం బాండ్ కాస్త క్లిక్ అయ్యింది. ఆ తర్వాత వచ్చిన పరం సుందరి, సన్నీ సన్స్కారి కి తులసి కుమారి కూడా డిజప్పాయింట్ చేసింది. ప్రస్తుతం పెద్ది తప్ప అమ్మడి ఖాతాలో మరో సినిమా లేదు. బాలీవుడ్ కన్నా టాలీవుడ్ ని నమ్ముకుంటే బెటర్ అని భావిస్తుందట జాన్వి కపూర్. ఎందుకంటే శ్రీదేవి తనయురాలిగా జాన్వికి ఆల్రెడీ తెలుగులో సూపర్ క్రేజ్ ఉంది. తను చేస్తా అంటే చాలు కానీ వరుస ఛాన్స్ లు ఇచ్చేందుకు రెడీగా ఉన్నారు మేకర్స్. ఆమధ్య నాని సినిమాలో జాన్వి నటిస్తుందని వార్తలు వచ్చాయి కానీ అది జస్ట్ రూమర్ అని తెలిసింది.

# అదిరింది..!



## కేక పుట్టించిన డబ్ల్యూపీఎల్ ఓపెనింగ్ సెరమనీ

### స్టెప్పులతో ఉర్రూతలూగించిన జాక్వెలిన్

### పాటలతో హోరెత్తించిన హనీ సింగ్

మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ ఆరంభ వేడుకలు అంబరాన్నంటాయి. బాలీవుడ్ సింగర్ యోయో హనీ సింగ్ పాటలతో, అందాల నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ డాన్స్ షోతో నవీ ముంబైలోని డీవై పాటిల్ మైదానం దద్దరిల్లిపోయింది. తన హిట్ సాంగ్స్‌తో హనీ సింగ్ అభిమానులను ఉర్రూతలూగించగా.. జాక్వెలిన్ తనదైన మెస్మరైజింగ్ నృత్యంతో మరోసారి అందరి మనసులు కొల్లగొట్టింది. డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్ తొలి మ్యాచ్ మరికొన్ని నిమిషాల్లో మొదలవ్వనుంది. టాస్ గెలిచిన ఆర్సీబీ కెప్టెన్ స్మృతి మంధాన బౌలింగ్ ఎంచుకుంది. టాస్ పూర్తయ్యాక మాజీ మిస్ యూనివర్స్ హర్నాజ్ సంధు స్టేజీ మీదకొచ్చి మహిళా శక్తిని చాటి చెప్పింది. క్రికెట్‌తో పాటు పలు రంగాల్లో అతివల కృషిని ఈ విశ్వ సుందరి కొనియాడింది. అనంతరం బాలీవుడ్ నటి జాక్వెలిన్ ఫెర్నాండేజ్ తన డాన్స్ స్టెప్పులతో ప్రేక్షకులను అలరించింది. 'జుమ్మే కీ రాత్ హై' వంటి హిట్ పాటలకుతన బృందంతో కలిసి హుషారుగా నర్తించిన ఈ సుందరాంగి అభిమానులను మంత్రముగ్ధులను చేసింది. గాయకుడు యోయో హనీ సింగ్ తన గాత్రంతో ఫ్యాన్స్‌ను సంగీత ఝరిలో ముంచేశాడు. చెన్నై సూపర్ కింగ్స్‌లోని 'లుంగి డాన్స్, మరో హిట్ సాంగ్ 'వన్స్‌మోర్'తో అభిమానులతో స్టెప్పులు వేయించాడు.





## ఎప్పటికీ రోహితే
# నా కెప్టెన్: జై షా

ఐసీసీ ఛైర్మన్ జై షా.. టీమిండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఓ కార్యక్రమంలో రోహిత్‌ను జై షా కెప్టెన్ అంటూ పిలిచారు. అతడిని కేవలం కెప్టెన్ అని మాత్రమే పిలుస్తాననడంతో హిట్‌మ్యాన్ చిరునవ్వులు చిందించాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. అయితే రోహిత్ శర్మ ఇప్పటికే టెస్టు, టీ20 ఫార్మాట్లకు వీడ్కోలు పలికి కేవలం వన్డేల్లోనే



కొనసాగుతున్న విషయం తెలిసిందే. 'మన కెప్టెన్ ఇక్కడే ఉన్నాడు. నేను అతడిని కెప్టెన్ అని మాత్రమే పిలుస్తాను. రోహిత్ నాకు ఎప్పటికీ కెప్టెనే. అతడు టీమిండియాకు రెండు ఐసీసీ ట్రోఫీలందించాడు. 2023 ప్రపంచ కప్ టోర్నీలో భారత జట్టు వరుసగా పది మ్యాచుల్లో విజయం సాధించింది. అభిమానుల హృదయాలు గెలుచుకుంది. కానీ కప్‌ను మాత్రం సొంతం చేసుకోలేకపోయింది. నేను ఫిబ్రవరి 2024లో ఓ విషయం చెప్పాను. వచ్చే వరల్డ్ కప్‌లో మనం ట్రోఫీతో పాటు అభిమానుల హృదయాలను గెలుచుకోబోతున్నాం' అని జై షా పేర్కొన్నారు.

## ట్రావిస్ హెడ్ కీలక నిర్ణయం

ఆస్ట్రేలియా వేదికగా జరుగుతున్న బిగ్ బాష్ లీగ్ 15వ సీజన్‌కు దూరంగా ఉండాలని ట్రావిస్ హెడ్ నిర్ణయం తీసుకున్నాడు. వాస్తవానికి హెడ్ అడిలైడ్ స్ట్రైకర్స్, గ్రీన్ పెర్త్ స్కార్చర్స్ తరపున ఆడాల్సి ఉండేది. కానీ వర్క్‌లోడ్ మెనెజ్‌మెంట్‌లో భాగంగా హెడ్, కామెరూన్ గ్రీన్ విశ్రాంతి తీసుకోనున్నారు. వచ్చే నెలలో జరగనున్న టీ20 ప్రపంచకప్‌లో వీరిద్దరూ బరిలోకి దిగనున్నారు. హెడ్ ప్రస్తుతం అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. యాషెస్ సిరీస్‌లో హెడ్ 629 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

## దిగొచ్చిన బంగ్లాదేశ్

త్వరలో జరగబోయే టీ20 వరల్డ్ కప్ లో ఇండియాలో పాల్గొనడంపై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్ కాస్త వెనక్కి తగ్గినట్లు కనిపిస్తోంది. ఇండియాలో పాల్గొనాలంటే తమ జట్టుకు తగిన భద్రతకు హామీ ఇవ్వాలని కోరుతూ.. ఐసీసీకి మరో లేఖ రాసింది. ఈ అంశంలో ఇది ఐసీసీకి బంగ్లా రాసిన రెండో లేఖ. బంగ్లాదేశ్ లో హిందువులపై దాడి నేపథ్యంలో ఇండియా-బంగ్లా మధ్య ఇటీవల వివాదం మొదలైన సంగతి తెలిసిందే. ఇదే నేపథ్యంలో బంగ్లా క్రికెటర్ ముస్తాఫిజుర్ ను ఐపీఎల్ నుంచి తొలగించారు. దీంతో వివాదం మరింత ముదిరింది. అందుకే ఇండియాలో జరగబోయే టీ20 వరల్డ్ కప్ లో తాము పాల్గొనబోమని, తమ జట్టు ఇండియాలో ఆడే మ్యాచు వేదికల్ని శ్రీలంక లేదా మరో దేశానికి మార్చాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్ (బీసీబీ).. ఐసీసీకి లేఖ రాసింది. అయితే, ఇప్పుడు మ్యాచు వేదికల్ని మార్చడం సాధ్యం కాదని ఐసీసీ తెలిపింది. టోర్నీకి అన్ని ఏర్పాట్లు జరుగుతున్న తరుణంలో ఇప్పటికిప్పుడు వేదిక మార్చడం సాధ్యం కాదని ఐసీసీ తెలిపింది. దీనివల్ల చాలా ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొంది. దీంతో ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో బంగ్లాదేశ్ కాస్త వెనక్కి తగ్గినట్లు కనిపిస్తోంది. ఇండియాలో ఆడేందుకు తాము సిద్ధమే అని.. అయితే, ప్రతి ఒక్కరికి ప్రత్యేక భద్రతతోపాటు వ్యక్తిగత భద్రత కూడా కల్పించాలని ఐసీసీని కోరింది.

## తమీమ్ ఇండియన్ ఏజెంట్: బంగ్లా బోర్డు

భారత్, బంగ్లాదేశ్ మధ్య క్రికెట్ సంబంధాలపై అనిశ్చితి నెలకొన్న విషయం తెలిసిందే. ముస్తాఫిజుర్‌ను ఐపీఎల్ నుంచి తప్పించడం, టీ20 ప్రపంచకప్ కోసం తమ జట్టును ఇండియాకు పంపమని బంగ్లా బోర్డు ఐసీసీకి లేఖ రాయడం.. వంటివి ఇరుబోర్డుల మధ్య దూరాన్ని పెంచాయి.



ఈ నేపథ్యంలో బంగ్లా బోర్డు ఛైర్మన్ మరో వివాదానికి తెరలేపాడు. ఆర్థిక కమిటీ ఛైర్మన్ నజ్ముల్ ఇస్లాం మాజీ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్‌ను ఇండియన్ ఏజెంట్ అని పేర్కొంటూ ఫేస్‌బుక్ పోస్ట్ పెట్టాడు. బంగ్లాదేశ్‌లో హిందువుల హత్యలను నిరసిస్తూ ఐపీఎల్ నుంచి ఆ దేశ పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను తప్పించడంతో ఇరుదేశాల మధ్య క్రికెట్ సంబంధాలు దెబ్బతిన్నాయి. ప్రతిచర్యగా భద్రతా కారణాల రీత్యా భారత్‌లో టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లు ఆడబోమని బంగ్లాదేశ్ బోర్డు ఐసీసీకి లేఖ రాసింది. ఈ నిర్ణయాన్ని మాజీ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ వ్యతిరేకించాడు. దాంతో.. అతడిని లక్ష్యంగా చేసుకొని బంగ్లా బోర్డు కమిటీ, ఆర్థిక కమిటీ ఛైర్మన్ నజ్ముల్ ఇస్లాం పోస్ట్ పెట్టాడు. 'ఈసారి బంగ్లాదేశ్ ప్రజలు తమ కళ్లతో ప్రత్యక్షంగా చూశారు. మరో భారత ఏజెంట్ పుట్టుకొచ్చాడు' అని తమీమ్ ఇక్బాల్‌ను ఉద్దేశించి నజ్ముల్ ఇస్లాం పోస్ట్ పెట్టాడు.



## బెంగళూరు
# బోణీ

### డబ్ల్యూపీఎల్ తొలి మ్యాచ్‌లో గెలుపు

### ఉత్కంఠగా సాగిన మ్యాచ్

**మహిళల ప్రిమియర్ లీగ్ 2026 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బోణీ కొట్టింది. నవీ ముంబయి వేదికగా ముంబయి ఇండియన్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో ఘన విజయం సాధించింది. చివరి బంతి వరకు పోరాడి... 155 పరుగుల లక్ష్యన్ని 3 వికెట్ల తేడాతో ఛేదించింది.**

నదైన్ డీక్లార్క్ (63) అర్ధశతకంతో చెలరేగింది. లక్ష్య ఛేదనకు దిగిన బెంగళూరు ఓపెనర్లు గ్రేస్ హారిస్ (25), స్మృతి మంధాన (18) శుభారంభాన్నిచ్చారు. అరుంధతిరెడ్డి (20) కీలక ఇన్నింగ్స్ ఆడింది. మిగతావారెవ్వరూ పెద్దగా రాణించలేదు. ముంబయి బౌలర్లలో నికోలా కార్వే, అమేలియా ఖేర్ చెరో 2 వికెట్లు పడగొట్టగా.. బ్రంట్, షబ్నిమ్ ఇస్మాయిల్, అమన్‌జ్యోత్ కౌర్ తలో వికెట్ తీశారు. చివరి ఓవర్లో 18 పరుగులు చేయాల్సిన తరుణంలో బ్రంట్ బంతి అందుకుంది. తొలి రెండు బంతులకు ఒక్క పరుగు కూడా రాలేదు. మూడో బంతికి లాంగ్ ఆఫ్ మీదుగా డిక్లార్క్ సిక్స్ కొట్టింది. తర్వాతి బంతికి బౌండరీ బాదేసి అర్ధశతకం పూర్తి చేసుకుంది. అప్పటి వరకు విజయం సాధిస్తామన్న ధీమాతో ఉన్న ముంబయి ఒక్కసారిగా ఒత్తిడిలోకి వెళ్లింది. తర్వాతి స్లో డెలివరీని డిక్లార్క్ సిక్సర్‌గా మలిచింది. చివరి బంతికి 2 పరుగులు రాబట్టాల్సిన తరుణంలో.. మరో బౌండరీ బాదేసి జట్టును డిక్లార్క్ విజయతీరాలకు చేర్చింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన ముంబయి నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 154 పరుగులు చేసింది. నికోలా కారీ (40), సజీవన్ సజనా (45), కమలిని (32), హర్మన్ ప్రీత్ కౌర్ (20) రాణించారు. అమెలియా కెర్ 4, నాట్ స్కివర్ బ్రంట్ 4 విఫలమయ్యారు. ఆర్సీబీ బౌలర్లలో నదైన్ డిక్లార్క్ 4.. శ్రేయాంక పాటిల్, లారెన్ బెల్ చెరో వికెట్ తీశారు.



## సెమీఫైనల్లోకి
# పీవీ సింధు

### మలేషియా ఓపెన్‌లో జోరు

ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు.. మలేషియా ఓపెన్ సూపర్ బ్యాడ్మింటన్ టోర్నీలో సెమీఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ప్రత్యర్థి జపాన్ క్రీడాకారిణి అకనే యమగుచి గాయం వల్ల రిటైర్ అయ్యింది. దీంతో పీవీ సింధు ఎటువంటి ప్రతిఘటన లేకుండానే సెమీస్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. మూడు సార్లు వరల్డ్ చాంపియన్ అయిన యమగుచిపై తొలి గేమ్‌లో 21-11 తేడాతో పీవీ సింధు విక్టరీ కొట్టింది. అయితే మోకాలి బెల్ట్ పెట్టుకుని గేమ్ ఆడిన జపాన్ ప్లేయర్ తొలి గేమ్ ఓడిన తర్వాత మ్యాచ్ నుంచి తప్పుకున్నది. ప్రస్తుతం వరల్డ్ నెంబర్ 18వ స్థానంలోఉన్న సింధు..గాయం నుంచి కోలుకున్న తర్వాత తొలిసారి టోర్నమెంట్ ఆడుతున్నది.



## ఇంగ్లండ్‌కు ఆండీ ఫ్లవర్ బెస్ట్: పీటర్సన్

ఇంగ్లండ్ కోచ్‌గా ఆండీ ఫ్లవర్‌ను మళ్లీ తీసుకోవాలని కెవిన్ పీటర్సన్ సూచించాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో 'బజ్‌బాల్ల ఆటను నమ్ముకున్న ఇంగ్లండ్ నిరుడు భారత జట్టు చేతిలో, తాజాగా యాషెస్ సిరీస్‌లో భంగపడింది. వరుసగా నాలుగోసారి యాషెస్‌ను కోల్పోవడాన్ని అవమానంగా భావిస్తున్న ఆ దేశ బోర్డు భారీ మార్పులకు సిద్ధమవుతోంది. హెడ్‌కోచ్ మెక్‌కల్లమ్ స్థానంలో మరొకరిని నియమించడం ఖాయమనిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో ఇంగ్లండ్ మళ్లీ పుంజుకోవాలంటే గతంలో కోచింగ్ ఇచ్చిన ఆండీ ఫ్లవరే పెద్ద దిక్కు అని పీటర్సన్ శుక్రవారం ఎక్స్ వేదికగా వెల్లడించాడు. 'ఈ నిర్ణయం చాలా గొప్పది. ఆండీ ఫ్లవర్‌ను మళ్లీ ఇంగ్లండ్ కోచ్‌గా నియమిస్తే అతడు రాత మారుస్తాడు. అతడికి టెస్టు క్రికెట్‌పై పట్టుంది.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం www.evarthalu.com
నేటి ఈవార్తలు
శనివారం 10-1-2026




బంగ్లాదేశ్‌లో నెలకొన్న ప్రస్తుత అరాచక పరిస్థితులు నాగరిక ప్రపంచాన్ని విస్మయానికి గురిచేస్తున్నాయి. ఒక దేశంలో ప్రజాస్వామ్యం కుప్పకూలినప్పుడు, ఆ అరాచకానికి బలయ్యేది ఎప్పుడూ బలహీనులే అన్న చేదు నిజం మరోసారి రుజువవుతోంది. విద్యార్థుల ఉద్యమం సాకుగా మారి, అది చివరకు ఒక వర్గంపై మతోన్మాద దాడులుగా పరిణమించడం అత్యంత విచారకరం. అక్కడ మైనారిటీలుగా ఉన్న హిందువులు, క్రైస్తవులు, బౌద్ధుల ప్రాణాలు గాల్లో దీపాల్లా మారాయి.

ఇది కేవలం ఒక దేశపు అంతర్గత సమస్య కాదు, ఇది మానవ హక్కుల ఉల్లంఘన, పొరుగు దేశంగా భారత్‌ను తీవ్రంగా కలవరపరిచే అంశం. భాషా ప్రాతిపదికన, విముక్తి పోరాట స్ఫూర్తితో ఏర్పడిన ఈ దేశం నేడు మతోన్మాద శక్తుల చేతుల్లో చిక్కుకుని విలవిలలాడుతోంది. షేక్ హసీనా ప్రభుత్వం పతనమైన తర్వాత బంగ్లాదేశ్‌లో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి. అపద్ధర్మ ప్రభుత్వం ఏర్పడినప్పటికీ, క్షేత్రస్థాయిలో హింస ఆగడం లేదు.

కేవలం మతం ప్రాతిపదికన వ్యక్తులను గుర్తించి వారి ఇళ్లను తగలబెట్టడం, వ్యాపార సంస్థలను లూటీ చేయడం, దారుణంగా హత్య చేయడం వంటి ఉదంతాలు నిత్యకృత్యమయ్యాయి. దేవాలయాలపై దాడులు జరగడం, విగ్రహాలను ధ్వంసం చేయడం ఒక వర్గం యొక్క అస్తిత్వాన్ని తుడిచిపెట్టే ప్రయత్నంగా కనిపిస్తోంది.

## ప్రజాస్వామ్య ముసుగులో మతోన్మాద విధ్వంసం

- వ్యవస్థీకృత హత్యలు: గ్రామీణ ప్రాంతాల్లోని హిందూ ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారవేత్తలను ఇళ్ల నుంచి లాగి మరీ చంపడం చూస్తుంటే, ఇది ఆకస్మికంగా జరిగిన హింస కాదు అని అర్థమవుతోంది.
- ఆస్తుల లూటీ: మైనారిటీల ఇళ్లను తగులబెట్టడం, వారి దుకాణాలను లూటీ చేయడం ద్వారా వారిని ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తీయడం ఈ అరాచక మూకల ప్రధాన లక్ష్యం.
- దేవాలయాల ధ్వంసం: ఇస్కాన్ దేవాలయాలతో సహా వందలాది చారిత్రక దేవాలయాలను నేలమట్టం చేయడం ద్వారా ఒక వర్గపు సాంస్కృతిక అస్తిత్వాన్ని తుడిచిపెట్టే ప్రయత్నం జరుగుతోంది.
- శరణార్థుల సమస్య: హింస తట్టుకోలేక వేలాది మంది సరిహద్దుల వైపు పరుగులు తీస్తున్నారు. ఇది భారత్‌లో జనాభా సమతుల్యతను దెబ్బతీయడమే కాకుండా, సామాజిక ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం ఉంది.
- జాతీయ భద్రత: బంగ్లాదేశ్‌లో అతివాద శక్తులు బలపడితే, అది భారత్ వ్యతిరేక ఉగ్రవాద కార్యకలాపాలకు అడ్డాగా మారుతుంది.
- నైతిక బాధ్యత: పొరుగు దేశంలో తన సోదర సమానమైన మైనారిటీలు హింసకు గురవుతుంటే భారత్ మౌనంగా ఉండలేదు. భారత ప్రభుత్వం అంతర్జాతీయ వేదికలపై ఈ విషయాన్ని మరింత తీవ్రంగా లేవనెత్తాలి.
- రక్షణ దళాల మోహరింపు: బంగ్లాదేశ్ అపద్ధర్మ ప్రభుత్వం తక్షణమే మైనారిటీలు నివసించే ప్రాంతాల్లో సైనిక రక్షణ కల్పించాలి.
- కఠిన శిక్షలు: హింసకు పాల్పడిన వారిని గుర్తించి, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా శిక్షించాలి.
- పరిహారం: ఆస్తులు కోల్పోయిన మైనారిటీలకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించి, వారిని పునరావాసం కల్పించాలి.
- ప్రజాస్వామ్య పునరుద్ధరణ: ఎన్నికలు త్వరగా నిర్వహించి, అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం ఉండేలా చూడాలి.




# ప్రాణత్యాగానికి ప్రతిఫలమా..!



శశిధర్ అక్కెల

**1971లో** బంగ్లాదేశ్ విముక్తి పోరాటం జరిగినప్పుడు 'మతాతీత వాదం' ఆ దేశ ప్రధాన పునాదులలో ఒకటిగా ఉంది. ముస్లింలు, హిందువులు కలిసి పాకిస్థాన్ అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడారు. కానీ నేడు అదే దేశంలో మైనారిటీలు పరాయివారుగా మార్చబడ్డారు. అతివాద సంస్థలైన జమాత్-ఇ-ఇస్లామీ వంటి శక్తులు విద్యార్థుల ముసుగులో ఈ హింసను ప్రేరేపిస్తున్నాయి. ప్రజాస్వామ్యం పునరుద్ధరణ పేరుతో జరుగుతున్న ఈ అరాచకం, వాస్తవానికి ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ చిన్న సంఘటన జరిగినా గొంతు విప్పే అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు, బంగ్లాదేశ్‌లో జరుగుతున్న ఈ మారణహోమంపై ఆశించిన స్థాయిలో స్పందించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. పాశ్చాత్య దేశాలు తమ ప్రయోజనాల కోసం ఈ అరాచకాలను పట్టించుకోకపోవడం వారి ద్వంద్వ నీతిని బయటపెడుతోంది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు, బాధితుల ఆర్తనాదాలు చూస్తున్నా, ప్రపంచ దేశాలు కేవలం 'కలత చెందాం' అనే ప్రకటనలకే పరిమితం కావడం దురదృష్టకరం. మైనారిటీల రక్షణ బాధ్యతను ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వం స్వీకరించాలి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోతే, ఈ హింస ఇతర ప్రాంతాలకు కూడా పాకే ప్రమాదం ఉంది.

### భారత్ మౌన ప్రేక్షకుడిగా ఉండలేదు

బంగ్లాదేశ్‌తో సుదీర్ఘ సరిహద్దు కలిగిన భారత్, ఈ విషయంలో కేవలం మౌన ప్రేక్షకుడిగా ఉండలేదు. మన పొరుగు దేశంలో మతపరమైన హింస పెరిగితే, అది సరిహద్దుల్లో చొరబాట్లకు, జాతీయ భద్రతకు ముప్పుగా మారుతుంది. భారత ప్రభుత్వం ఇప్పటికే ఆ దేశ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నప్పటికీ, అంతర్జాతీయ వేదికలపై ఈ విషయాన్ని మరింత గట్టిగా వినిపించాల్సిన అవసరం ఉంది. చరిత్రను గమనిస్తే, ఏ దేశంలోనైతే మైనారిటీలకు రక్షణ ఉండదో, ఆ దేశం ఆర్థికంగా, సామాజికంగా ఎప్పటికీ




ఎదగలేదు. బంగ్లాదేశ్ తనను తాను ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకోవాలంటే, అక్కడి మెజారిటీ సమాజం మైనారిటీలకు అండగా నిలబడాలి. హింసను ప్రేరేపిస్తున్న అతివాద శక్తులను ఏకాకి చేయాలి. మతం పేరుతో జరుగుతున్న ఈ అనాగరిక కృత్యాలను ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలి. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, అరాచకాలు మానవత్వానికే మచ్చ. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఓటు వేయడం కాదు, మెజారిటీ పాలనలో మైనారిటీల భద్రతను నిర్ధారించడం. ఇప్పటికైనా అపద్ధర్మ ప్రభుత్వం, అంతర్జాతీయ సంస్థలు మేల్కొని, అక్కడ మైనారిటీల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పించాలి. శాంతి లేని సమాజం అభివృద్ధి చెందదు, హింసతో సాధించే విజయం ఎప్పటికీ శాశ్వతం కాదు.

బంగ్లాదేశ్‌లో మైనారిటీల రక్షణ అనేది కేవలం ఆ దేశ సమస్య కాదు, ఇది మొత్తం నాగరిక సమాజానికి సంబంధించిన ప్రశ్న. ఏ దేశమైనా తన సొంత పౌరులను మతం పేరుతో రక్షించుకోలేకపోతే, ఆ దేశానికి స్వతంత్రంగా ఉండే హక్కు లేదని భావించాలి. మతోన్మాద రక్కసి ఏ దేశానికైనా ప్రమాదకరమే. ఇవాళ బంగ్లాదేశ్‌లో మైనారిటీలు బలవుతుంటే, రేపు అది ఆ దేశాన్నే సర్వనాశనం చేస్తుంది. అరాచక శక్తులపై ఉక్కుపాదం మోపాల్సిన సమయం ఆసన్నమైంది. బంగ్లాదేశ్ మైనారిటీల కన్నీళ్లు ఆగి, అక్కడ శాంతి నెలకొన్నప్పుడే ఆ దేశ విముక్తి పోరాటానికి నిజమైన అర్థం లభిస్తుంది. ప్రపంచ దేశాలన్నీ ఏకమై ఈ హింసను అరికట్టాలని, బాధితులకు న్యాయం చేయాలి.

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.